నగర ప్రజల సమస్యల పరిష్కారంపై పోరాడాలి

నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ



నగరంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై పోరాడాలని సీపీఐ జిల్లా కార్యదర్శి సుదాకర్ పిలుపునిచ్చారు. ఆదివారమిక్కడ సీపీఐ కార్యాలయంలో పార్టీ 8, 29 డివిజన్ల ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించి కమిటీలను ఎన్నుకున్నారు. సమావేశానికి పి.హనుమాన్లు అధ్యక్షత వహించగా జిల్లా కార్యదర్శి పి.సుధాకర్, నగర ఇంచార్జ్ వై.ఓమయ్య నాయకులు రాజన్న, ఎండీ.రఫీక్ ఖాన్ హాజరయ్యారు. ఎనిమిదవ డివిజన్ కార్యదర్శిగా పిన్నెల హనుమాన్లు, 29వ డివిజన్ కార్యదర్శిగా బాల్ లింగం, కమిటీ సభ్యులుగా ఆడెపు గంగాధర్, కండ్లకోయ గంగాధర్, కవిత, అలీ ఇమ్రాన్, రజాక్, భానుచందర్, అజిత్ సింగ్, తదితరులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

అనుదినం జనస్వరం
నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
నిజామాబాద్-కామారెడ్డి
1
సోమవారం 30 జనవరి 2023

ఉత్నూర్‌లో పశువైద్యశిబిరం

నవతెలంగాణ-సదాశివనగర్



మండలంలోని ఉత్నూర్ గ్రామంలో విజయ పాల ఉత్పత్తి దారుల సహకార సంఘం ఆధ్వర్యంలో మెట్‌పల్లి పశువైద్య కళాశాల సహకారంతో ఆదివారం పశువైద్య శిబిరం నిర్వహించారు. పశువులకు కృత్రిమ గర్భధారణ, సాధారణ పరీక్షలు, నట్టల నివారణ మందులు వేశారు. రైతులకు పాడి పరిశ్రమపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి గైని అనుసూయ, జడ్పీటీసీ కమిలి నర్సింలు, సర్పంచ్ మోతె సాయవ్వ, ప్రొఫెసర్‌లు జగన్మోహన్ రెడ్డి, అరుణ, డాక్టర్ రమేష్, పాలకేంద్రం అధ్యక్షుడు నరేందర్ రావు, ఉపసర్పంచ్ శివ తదితరులు పాల్గొన్నారు.

సూ'సైడ్' చేయాలి

ఆత్మహత్యలకు కేరాఫ్‌గా బాసర గోదావరి

- ఆందోళనకరంగా వరుస ఘటనలు
- ప్రాణాలు పోతున్నా పట్టించుకోవట్లే
- రక్షణ కల్పించాలని వేడుకోలు





బాసర వద్ద గోదావరిపై బ్రిడ్జి

నవతెలంగాణ-నవీపేట్

రాష్ట్రంలోనే ఆత్మహత్యలకు కేరాఫ్‌గా బాసర గోదావరి మారింది. దేశంలోనే చదువులమ్మ తల్లి బాసర సరస్వతి జ్ఞానానికి ప్రతీకగా వెలుగొందుతోంది. కానీ ఆ సరస్వతమ్మ క్షేత్రంలోని గోదావరిలో పలువురు క్షణికావేశంతో నిండు జీవితాన్ని నీటి పాలు చేసుకుంటు న్నారు. ఆత్మహత్యాలకు కేరాఫ్ అడ్డాగా బాసర గోదావరి మారింది. కుటుంబ కలహాలు, ఆర్థిక ఇబ్బందులు, ప్రేమ విఫలమై, అనారోగ్య సమస్యలు, జీవితంపై విరక్తి చెంది ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. నిజామాబాద్, హైదరాబాద్ నుండే కాకుండా బైంసా, నిర్మల్ మహారాష్ట్ర ధర్మాబాద్, పర్భని, నాందేడ్ తదితర ప్రాంతాల నుంచి ఇక్కడి వచ్చి బలవన్మరణానికి పాల్పడుతుండటంతో బాసర తీర్థం.. ఆత్మహత్యలకు అడ్డాగా మారింది. కాగా ఇటీవల చోటు చేసుకుంటున్న వరుస ఘటనలు ఆందోళన కరంగా మారాయి. బాసర వద్ద సీసీ కెమెరాలతో నిరంతరం నిఘా ఏర్పాటు చేయాలని, రక్షణ చర్యలు చేపట్టాలని, పోలీసులతో నిరంతరం గస్తీ చేయించాలని స్థానికులు కోరుతున్నారు.

ఒకే నెలలో ఐదుగురు..

ఇటీవల బాసర గోదావరి వద్ద వరుస ఆత్మహత్య ఘటనలు చోటుచేసుకుంటు న్నాయి. నవీపేట్ మండలం లోని పొతంగల్ కు చెందిన ఇరిగేషన్ డిఈఈ రమణా రావు ఆత్మహత్య రాష్ట్రం లోనే సంచలంగా మారి ంది. గోదావరిలో దూకి ఆత్మహత్య చేసుకు న్నాడు. మామ అవమా నిం చాడని హైదరా బాద్‌కు చెందిన సందీప్ శనివారం పట్టపగలే ఆత్మహ త్యకు పాల్పడ్డాడు. అంతేకాకుండా అభం శుభం ఎరుగని కొడుకు, కుమార్తెతో నిజామాబాద్‌కు చెందిన ఓ తల్లి బాసర నదిలో స్నానమాచరించ డానికి వచ్చినట్టు వచ్చి నదిలో లోపలికి వెళ్లి ఆత్మహ త్యకు పాల్పడింది.

నవీపేట్ పోలీస్ స్టేషన్ పరిధి లో 2020లో ఐదు, 2021లో ఆరుగురు, 2022లో ఐదుగురు 2023లో ఇప్పటి వరకు ఇద్దరూ ఆత్మహ త్యకు పాల్పడి నట్లు కేసులు నమోద య్యా యి. బాసర పోలీస్ స్టేషన్ లో సైతం కేసులు నమోదు అవుతు న్నాయి. దీంతో పాటు మరి కొంత మంది ఆత్మహత్య లకు పాల్ప డగా.. వారి మృతదే హాలు కొట్టుకుపోతూ ఆచూకీ లేకుండా పోతున్నా యని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మృతదేహాలను గుర్తించడం, బయటకు తీయడం లాంటి పనులతో స్థానిక పంచాయతీ సిబ్బందికి సైతం అదనపు భారంగా మారింది.

> **గంగపుత్రులే రక్షకులు..**
>
> గోదావరిలో చేపలు పట్టే గంగపుత్రులే చాలా సందర్భాల్లో ప్రాణ రక్షకులుగా మారుతున్నారు. మహారాష్ట్ర పర్భనికి చెందిన విద్యార్థిని బాసర రైల్వే బ్రిడ్జిపై నుండి రాత్రి సమయంలో ఆత్మహత్య చేసుకునేందుకు గోదావరిలో దూకగా.. బ్రిడ్జి స్తంభం ఇనుప కడ్డీ పట్టుకొని రాత్రంతా నీటిలోనే గడిపింది. ఉదయం గమనించిన జాలర్లు ఆమెను సురక్షితంగా రక్షించారు. తల్లిదండ్రులు తమ పిల్లలతో కలిసి ఆత్మహత్యలకు ప్రయత్నిస్తున్న చాలా సందర్భాల్లో యంచ గ్రామ జాలర్లు, వీఆర్ఏలు యువకులు కాపాడుతున్నారు.

సూ'సైడ్' చేయాలి

జీవితంపై బాధ్యతగల వ్యక్తులు, ప్రేమించేవారు, తప్పులు చేయని వారు, ఆత్మాభిమానం గల వ్యక్తులు జీవితం అర్థరహితంగా మారిందని భావించే ఎక్కువ మంది ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. అటువంటి వ్యక్తులను రక్షించే బాధ్యత ప్రభుత్వ యంత్రాంగం తీసుకోవాలి. గోదావరి బ్రిడ్జి పైన సిసి కెమెరాలతో పాటు బ్రిడ్జికి రెండు వైపులా ఇనుప కంచె ఏర్పాటు చేసి పోలీసు, రెవెన్యూ సిబ్బంది నిఘాను పెంచితే ఆత్మహత్యలను నివారించే అవకాశం ఉంటుంది. అలాగే ఆత్మహత్యలకు పాల్పడేందుకు వచ్చిన వ్యక్తులను గుర్తించి పోలీసు శాఖ ద్వారా కౌన్సెలింగ్ ఏర్పాటు చేస్తే వారి సమస్యల నుండి బయటపడి కొత్త జీవితాన్ని ప్రారంభించే అవకాశం ఉంటుంది.

మంత్రికి, కలెక్టర్‌కు వినతి

ఆత్మహత్యలకు అడ్డాగా యంచా బ్రిడ్జి, బాసర గోదావరి మారిందని నివారణకు చర్యలు తీసుకోవాలని యంచ సర్పంచ్ లహరి, వార్డు సభ్యులు ప్రవీణ్‌కుమార్ ఇటీవల ఆర్ అండ్‌బీ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డితో పాటు కలెక్టర్ నారాయణరెడ్డి, ఎమ్మెల్యే షకీల్, సీపీ నాగరాజును కలిసి వినతిపత్రాలు అందజేశారు. రక్షణ చర్యలు చేపట్టాలని, నిఘా ఏర్పాటు చేయాలని కోరారు.



ప్రాణాలు పోతున్నా.. కాపాడలేకపోతున్నాం

ప్రవీణ్ కుమార్. యంచ వార్డుసభ్యులు



మా కండ్ల ముందే ప్రాణాలు పోతున్నా కొన్ని సందర్భాల్లో కాపాడ లేకపోతున్నాం. చాలా సందర్భాల్లో స్థానిక జాలర్లు, వీఆర్ఏలు యువకుల సాయంతో ప్రాణాలు కాపాడుతున్నప్పటికీ 100 శాతం నివారించలేకపోతున్నాం. కాబట్టి ప్రభుత్వ యంత్రాంగం స్పందించి గోదావరి బ్రిడ్జిపై ఆత్మహత్య నివారణ చర్యలను వెంటనే చేపట్టాలి.

నిరంతర నిఘా ఏర్పాటు చేయాలి

జాదవ్ కృష్ణ, బాసర్



బాసర పుణ్యక్షేత్రంలోని గోదావరిలో ఆత్మహత్యలు తరచూ జరగడం చాలా బాధాకరం. ఆత్మహత్యలతో చాలా కుటుంబాలు చిన్నాభిన్నం అవుతున్నాయి. కాబట్టి నిజామాబాద్, నిర్మల్ జిల్లా యంత్రాంగం స్పందించి ఆత్మహత్యలు జరగకుండా ముందస్తు జాగ్రత్త చర్యలు చేపట్టాలి.

పొలాలకు ఎలా వెళ్లాలి..?

- క్రాస్ బెరియర్ ఏర్పాటుపై రైతుల ఆగ్రహం

నవతెలంగాణ-సదాశివనగర్



వంపులు, బ్రిడ్జి లేకున్నా ఏర్పాటు చేసిన క్రాస్ బెరియర్

మండల కేంద్రంలోని 44వ జాతీయ రహదారి పక్కన పెట్రోల్ బంక్ ఎదురుగా క్రాస్ బెరియర్ ఏర్పాటుపై రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల ఏర్పాటు చేసిన క్రాస్ బెరియర్‌తో తాము పొలాలకు వెళ్లలేకపోతున్నామని ఆవేదన చెందుతున్నారు. సాధారణంగా రోడ్డు పక్కన వాగులు, వంపులు ఉన్న స్థలంలో వీటిని ఏర్పాటు చేయాల్సి ఉండగా.. అందుకు విరుద్ధంగా ఇక్కడ నేల సమాంతరంగా ఉన్నా క్రాస్ బెరియర్‌ను ఎందుకు ఏర్పాటు చేశారని ప్రశ్నిస్తున్నారు. ఇక్కడ ఏర్పాటు చేయాల్సిన అవసరం లేదని చెబుతున్నారు. సదాశివనగర్ మండలంలో సత్య పీర్ల దగ్గర ఇప్పుడు ఏర్పాటు చేసిన దాని కన్నా ముందుకు ఏర్పాటు చేయవలసి ఉంది. అక్కడ కొంత ఏర్పాటు చేశారు. ఇంక అక్కడ చేయవలసి ఉండగా అక్కడ సిమెంట్ పోల్స్‌ను ఏర్పాటు చేయవలసిన అవసరం ఉన్న దగ్గర కాకుండా అనవసర స్థలాల్లో నిర్మించారని రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వెంటనే తొలగించాలని, లేకుంటే పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని రైతులు హెచ్చరిస్తున్నారు. హైవే అధికారులు స్పందించి తొలగించాలని కోరుతున్నారు.

సాగుకు త్రీ ఫేజ్ కరెంట్ సరఫరా చేయాలి

విద్యుత్ సిబ్బంది ఘెరావ్

నవతెలంగాణ-బోధన్



వినతిపత్రం అందజేస్తున్న రైతులు

సాలూర మండలంలోని మంధర్నా గ్రామంలో ఆదివారం గ్రామస్తులు విద్యుత్ సిబ్బందిని ఘేరావ్ చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ రావుబా గంగాధర్ మాట్లాడుతూ హున్స సబ్ స్టేషన్ పరిధిలోని ఖాజాపూర్, హున్స, మంధర్న గ్రామాలలో రైతుల సౌకర్యం కోసం వ్యవసాయ పంటలకు ఉదయం 5 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు త్రీ ఫేజ్ కరెంటు సరఫరా చేయాలని కోరారు. ఈ ప్రాంతంలో చెరువులు లేకపోవడం వలన రైతులు బోరు బావులపై ఆధారపడి వ్యవసాయం చేస్తున్నారని కావున పటలకు సరిపడా సాగునీటి సౌకర్యం కోసం త్రీ ఫేజ్ కరెంటు సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం సిబ్బందికి వినతిప్రతం అందించారు. ఈ కార్యక్రమంలో హున్స సొసైటీ చైర్మెన్ రవి, రైతులు పాల్గొన్నారు.

రథ సప్తమి వేడుకలు

నవతెలంగాణ-జుక్కల్



రథం లాగుతున్న సర్పంచ్, పలువురు

మండలంలోని కౌలాస్ గ్రామంలో ఆదివారం రథ సప్తమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆదివారం వేకువజాము నుండే కార్యక్రమాలు ప్రారంభించారు. శనివారం రాత్రీ నుండి భజనలు, కీర్తనలతో గ్రామంలో సందడి వాతవరణం నెలకొంది. సర్పంచ్ గొల్ల హన్మండ్లు ప్రత్యేక పూజలు నిర్వహించి రథం ఊరేగింపు, అగ్నిగుండం ప్రారంభించారు. అనంతరం రథం గ్రామంలోని శివాలయం వరకు భాజాభజంత్రిల నడుమ, గ్రామస్తులు నృత్యాలు చేస్తు ఊరేగింపుగా తీసుకెళ్లారు. అనంతరం అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యేలు గంగారాం, అరుణ తారా, వైస్ ఎంపిపి ఉమాకాంత్, నాయకులు అక్షిత్ రాజా రమేష్ సింగ్, విఠల్ పటేల్, ప్రకాష్ పటేల్, బోడసాయులు, గంగాధర్, వినయ్ పటేల్, సత్యనారాయణ, మల్లప్పా తదితరులు పాల్గొన్నారు.

ఏసీడీ చార్జీలతో నడ్డి విరుస్తున్న ప్రభుత్వం



మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

నవతెలంగాణ-భిక్కనూర్

రాష్ట్ర ప్రభుత్వం ఏసిడి చార్జీల పేరిట విద్యుత్ చార్జీలను తమ ఇష్టానుసారం పెంచి సామాన్య ప్రజల నడ్డి విడుస్తుందని డిసిసి ఉపాధ్యక్షుడు చంద్రకాంత్ రెడ్డి, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు భీమ్ రెడ్డి తెలిపారు. ఆదివారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ ప్రభుత్వం విద్యుత్ ఏసిడి చార్జీలను తగ్గించేంత వరకు విద్యుత్ చార్జీలు ఎవరు చెల్లించవద్దన్నారు. ఏ సి డి చార్జీలు వినియోగదారులపై అదనపు భారం పడుతుందని, ఏ సి డి చార్జీలు తగ్గించేంతవరకు కాంగ్రెస్ పార్టీ ఆందోళన కార్యక్రమం నిర్వహిస్తుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఏ సి డి చార్జీలు తగ్గించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కిసాన్ సెల్ అధ్యక్షుడు కుంట లింగారెడ్డి, పట్టణ యూత్ నాయకుడు ద్యాగాల కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

డీసీఎం వ్యాన్ ఢీకొని ఒకరి మృతి



ఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

నవతెలంగాణ-తాడ్వాయి

తాడ్వాయి మండల కేంద్రంలోని శ్రీ శబరి మాత ఆశ్రమం సమీపంలో ఆదివారం డిసిఎం వ్యాన్ ఢీకొని ఒకరు మృతి చెందినట్లు ఎస్సై ఆంజనేయులు తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని దేవాయిపల్లి గ్రామానికి చెందిన కాత్రాల మల్లయ్య (40) అనే వ్యక్తి పని నిమిత్తం దేవాయపల్లి నుంచి తాడ్వాయికి వచ్చాడు. పెట్రోల్ పంపు ప్రాంతం నుంచి రోడ్డుపైకి మోటార్ సైకిల్‌పై వస్తుండగా కామారెడ్డి నుంచి తాడ్వాయి వైపునకు వస్తున్న డీసీఎం వ్యాను ఎలాంటి ఇండికేటర్లు వేయకుండా పెట్రోల్ పంపు లోకి వేగంగా వచ్చి మోటార్ సైకిల్‌ను ఢీకొట్టడంతో మల్లయ్య అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య రజిత, కుమార్తె మానస, కుమారుడు ఉన్నారు. ఈ విషయమై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టినట్టు తెలిపారు.

చరిత్రను పరిశోధించండి.. లిఖించండి

నవతెలంగాణ-కంఠేశ్వర్



పలువురికి సన్మానం

ఉమ్మడి నిజామాబాద్ జిల్లా చరిత్ర ను పరిశోధించి అధ్యయనం చేసి లిఖించాలని అఖిల భారతీయ ఇతిహాస సంకలన సమితి జాతీయ ఉపాధ్యక్షుడు వి.కిషన్ రావు అన్నారు. నగరంలోని ఓ హోటల్ హాల్‌లో ఇందూరు ఇతిహాస సంకలన సమితి ఆదివారం నిర్వహించిన చరిత్ర దినోత్సవంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. మన చరిత్ర మన ప్రాముఖ్యత ను చదవాలని, చరిత్ర ను నేటితరానికి తెలియజేయా లని కోరారు. ప్రతి ఒక్కరూ చరిత్ర నిర్మాతలు కావాలని అన్నారు. సిద్ధ సాయరెడ్డి రచించిన బోధన్ చరిత్ర గ్రంథాన్ని గురు చరణం, బాల శ్రీనివాస మూర్తి, ప్రముఖ జిల్లా చరిత్ర కారుడు కందకుర్తి యాదవ రావు లతో కలిసి ఆవిష్కరించారు. బోధన్ ప్రాంతానికి చాలా పురాతన చరిత్ర ఉన్నదని ఆ చరిత్రను మరింత వెలికి తీయాలని కోరారు. చరిత్ర ను పునర్ లిఖించాల్సిన అవసరాన్ని గుర్తు చేశారు.

తెలంగాణ యూనివర్సిటీ అసోసియేట్ ప్రొఫెసర్ బాల శ్రీనివాస మూర్తి మాట్లాడుతూ.. నిజాం పాలన కాలంలో 1940 నుండి 1948 వరకు దాదాపు తొమ్మిదేళ్ల నిజాం సంస్థానంలో న్యాయవాదులు సమ్మె చేసి సుదీర్ఘ ఉద్యమాన్ని ఉధృతం చేసిన చరిత్ర ను తెలియజేశారు. దాశరథి కృష్ణ మాచార్య నిజామాబాద్ జిల్లా జైలులోని గోడలపైన బొగ్గు తో లిఖించిన నా తెలంగాణ కోటి రతనాల వీణ అనే చారిత్రాత్మక పద్య గేయమే తెలంగాణ రాష్ట్ర ఉద్యమానికి ప్రేరణగా నిలిచిన చరిత్రను తెలియజేశారు. ఈ కార్యక్రమంలో చరిత్ర, సాహిత్య రంగాలలో పరిశోధన చేసి పి. హెచ్. డి (డాక్టరేట్) పొందిన డాక్టర్ శమంత, డాక్టర్ ధమని సాయిలు, డాక్టర్ ముబీనుద్దీన్, మాడపాటి కుమారస్వామి, బాధర వేణి నాగరాజు, క్యాతం నరేందర్, చౌకే జగదీశ్వర్ లను సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఇతిహాస సంకలన సమితి బాధ్యులు కందకుర్తి ఆనంద్, చరిత్ర పరిశోధకులు కందకుర్తి యాదవ రావు, గంట్యాల ప్రసాద్ న్యాయవాదులు జగన్మోహన్ గౌడ్, పడిగల వెంకటేశ్వర్, వసంతరావు, కవులు కాసర్ల నరేష్‌రావు, చందనరావు పాల్గొన్నారు.

ఏదును చంపిన కేసులో ముగ్గురి అరెస్టు

నవతెలంగాణ-తాడ్వాయి



ముగ్గురిని అదుపులోకి తీసుకున్న ఫారెస్ట్ అధికారులు

తాడ్వాయి మండలం సంతాయిపేట అటవీ శివారులో శనివారం రాత్రి ఏదును (ముల్ల పందిని) చంపి దేవునిపల్లికి తరలిస్తుండగా అటవీశాఖ అధికారులు పట్టుకొని ముగ్గురిపై కేసు నమోదు చేశారు. లింగంపేట్ ఫారెస్ట్ పరిధిలోని సంతాయిపేట అటవీ ప్రాంతంలో ఏదును చంపి తరలిస్తుండగా పక్క సమాచారంతో అధికారులు వెంబడించి పట్టుకున్నారు. వైల్డ్‌లైఫ్ ప్రొటెక్షన్ ఆక్ట్ 1972 కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు శాఖ అధికారులు వివరించారు. ఎవరైనా అడవి జంతువులను వేటాడినట్లయితే అటవీ చట్టాల ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎఫ్ఆర్‌వో రమేష్, డిఆర్‌ఓ పద్మ, ఎఫ్‌బీఓ రాజమణి ఉన్నారు.

శ్రీ కాలభైరవ స్వామిని దర్శించుకున్న మెట్రోపాలిటన్ జడ్జి దంపతులు

నవతెలంగాణ- రామారెడ్డి



ఆలయం వద్ద జడ్జి దంపతులు

మండలంలోని ఈసన్నపల్లి రామారెడ్డి లో వెలసిన శ్రీ కాలభైరవ స్వామి దేవస్థానాన్ని ఆదివారం నాంపల్లి మెట్రోపాలిటన్ కోర్టు జడ్జి పాపిరెడ్డి దంపతులు దర్శించుకున్నారు. ఆలయ పూజారులు వారికి పూర్ణకుంభంతో స్వాగతం పలకగా, ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. పూజారులు ఆలయ చరిత్రను వివరించారు. ఆలయ కార్యనిర్వాహణాధికారి ప్రభు, సిబ్బంది వారికి శాలువాతో సన్మానించి, స్వామి వారి జ్ఞాపకతో పాటు తీర్థ ప్రసాదాలను అందజేశారు. కార్యక్రమంలో కోర్టు కానిస్టేబుల్ బాలరాజు, పూజారులు శ్రీనివాస్ శర్మ మనీష్ శర్మ, సిబ్బంది సురేందర్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

గంజాయి స్వాధీనం

నవతెలంగాణ-రాజంపేట్



గంజాయి స్వాధీనం చేసుకున్న పోలీసులు

మండలంలోని ఆర్గొండ గ్రామంలో ఆదివారం గ్రామానికి చెందిన జంగం భూమయ్య ఇంటిలో ఎండు గంజా ఉన్నట్లు సమాచారం అందడంతో ఎస్సై రాజు ఆధ్వర్యంలో అతని ఇంట్లో తనిఖీలు నిర్వహించగా 280 గ్రాముల గంజాయి దొరికినట్లు ఆయన తెలిపారు. ఈ మేరకు గంజాయిని స్వాధీనం చేసుకొని, భూమయ్యను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై రాజు తెలిపారు. ఈ కార్యక్రమంలో కానిస్టేబుల్ యాదగిరి తదితరులు పాల్గొన్నారు

జిల్లా సాధనకు మోకాళ్ళపై నిరసన

నవతెలంగాణ-బోధన్

బోధన్ జిల్లా సాధనకు ఆదివారం విద్యార్థి జేఏసీ నాయకులు మోకాళ్లపై కూర్చోని దీక్షలు చేపట్టారు. 42వ రోజు దీక్షల్లో విద్యార్థి జేఏసీ నాయకులు శివకుమార్, బీఎస్పీ నాయకులు రాంచందర్, అన్వర్ అలీ, ఖైసర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బోధన్ జిల్లా సాధించే వరకూ రాజ్యాంగ స్పూర్తి తో ఉద్యమం కొనసాగిస్తామని అన్నారు. ఉద్యమ కార్యాచరణ ప్రకారం స్థానిక పరిస్థితులకు అనుగుణంగా పోరాట కార్యక్రమాలు ఉంటాయన్నారు. త్వరలో ఉద్యమ పోరాట కార్యాచరణ ప్రటిస్తామన్నారు. కార్యక్రమంలో న్యాయవాది అడ్లూరి శ్రీనివాస్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు ఖాజా ఫయాజుద్దీన్, వైర్ మెన్ అసోసియేషన్ అధ్యక్షులు గంగారాం , కార్యదర్శి నిమ్మ శ్రీనివాస్ న్యాయవాదులు అర్జున్ రండర్, హన్మంతు రావు,లక్ష్మినారాయణ,శంకర్ న్యాయవాదుల గుమస్తా అధ్యక్షులు గంగాధర్, జమీర్ ఖాన్ ,యేసుదాస్ లు పాల్గొన్నారు.

1న మోడల్ పాఠశాలలు ప్రారంభం

నవతెలంగాణ-బోధన్

బోధన్ మండలంలో ఫిబ్రవరి 1న మోడల్ పాఠశాలలను ప్రారంభిస్తున్నట్లు ఎంపీడీవో శ్రీనివాస్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. బోధన్ మండలంలోని పెంటాఖుర్ద్ మండల ప్రాథమిక పాఠశాల, సంగెం గ్రామంలోని మండల పరిషత్ పాఠశాల తెలుగు, ఉర్దూ మీడియం పాఠశాలలు, తగ్గెల్లిలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల, పట్టణంలోని గాంధీనగర్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల, శక్కర్ నగర్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో మోడల్ స్కూళ్లను పైలెట ప్రాజెక్టులో భాగంగా ప్రారంభిస్తున్నట్లు ఎంపీడీఓ వెల్లడించారు.

సైబర్ మోసాగాళ్లతో జాగ్రత్త

- సామాజిక మాధ్యమాల ద్వారానే ఎర
- విద్యావంతులే బాధితులు
- బ్యాంకు ఖాతాలనుండి లక్షలు మాయం

నవతెలంగాణ-ఆర్మూర్

రోజురోజుకు సైబర్ మోసాలు పెరిగిపోతున్నాయి. ఈ నేరగాళ్ల వలలో మామూలు ప్రజలతోపాటు ఉన్నత విద్యావంతులు పడుతుండడం గమనార్హం. జిల్లా కేంద్రంలోని ఒక సాఫ్ట్‌వేర్ ఉద్యోగి నుంచి ఏకంగా 11 లక్షలు నొక్కేయడంతో నాలుగో పోలీస్ స్టేషన్‌లో శుక్రవారం ఫిర్యాదు చేశారు. ఒకప్పుడు దొంగలంటే జేబులోని పైసలు, ఒంటిపై నగలు, తాళం వేసిన ఇంట్లో వస్తువులు దోచేవారు. ప్రస్తుతం సాంకేతికత పెరగడంతో నేరాల రూటు మార్చారు. సైబర్ నేరగాళ్లు కంటికి కనిపించకుండా బ్యాంక్ ఖాతాలోని నగదు కొల్లగొడుతున్నారు. ఒకవైపు మెట్రో నగరాలు పట్టణ ప్రాంతాలకి పరిమితమైన ఈ తరహా నేరాలు ఇప్పుడు మారుమూల గ్రామాలకు పాకింది. సాంకేతికతపై అవగాహన లేని వారిని లక్ష్యంగా చేసుకొని దోపిడీకి పాల్పడుతున్నారు.

ఆశల వల..

మోసాలకు పాల్పడేవారు మొదట ప్రజల అవసరాలు, బ్యాంకు ఖాతాలు, ఇంటర్నెట్ వినియోగ వివరాలు తెలుసుకొని అందుకు తగ్గట్టుగా నమ్మించి నిండా ఉంచుతున్నారు. ఇటీవల జిల్లా ఉన్నతాధికారుల వాట్సాప్, ఇన్‌స్టాగ్రామ్ నకిలీ ఖాతాలు సృష్టించి డబ్బులు అడిగిన ఉదంతాలు ఉన్నాయి .

ఎన్నో ఉదంతాలు..

జిల్లా కేంద్రానికి చెందిన అబ్దుల్ వహీద్ ఖాతానుంచి గత సెప్టెంబర్‌లో గుర్తు తెలియని వ్యక్తులు 11సార్లు 50,000 కాజేశారు. సైబర్ మోసగాళ్లు వీఐపి నంబరు పేరిట టోకరా వేయడంతో విద్యుత్ శాఖలో ఇంజనీరుగా పనిచేస్తున్న ముత్యం శ్రీకాంత్ యాదవ్ 28వేల 500 పోగొట్టుకున్నాడు. కామారెడ్డి జిల్లా కేంద్ర శివారులోని నరసన్నపల్లికి చెందిన రాజు పేమెంట్ బ్యాంక్ సర్వీస్ పాయింట్ నిర్వహిస్తున్నాడు. బయోమెట్రిక్ పరికరం గడువు ముగిసిందని గుర్తు తెలియని వ్యక్తి నుంచి ఫోన్ వచ్చింది. దీంతో 300 చెల్లించేందుకు ఏటీఎం కార్డును స్కాన్ చేసి పంపమన్నారు. అనంతరం విడతల వారీగా ఆయన ఖాతా



నుంచి 24 వేల 200 డ్రా చేసుకున్నారు. ఇదే జిల్లాలోని బీబీపేట మండలం ఇస్సానగర్ చెందిన కర్రోళ్ల రమేష్ ఈ కామర్స్ సంస్థలు కారు కొనుగోలు చేసేందుకు అభ్యర్థన పెట్టుకోగా సైబర్ నేరగాళ్లు మాయమాటలతో దోచుకున్నారు. ఇంటికి కారు తెచ్చిస్తామని రవాణా ఖర్చులకు 2000 వసూలు చేశారు. మరునాడు దారిలో ఆగిపోయామని నమ్మించి 14000, 7200 పోగొట్టుకున్నారు. మరిన్ని డబ్బులు పంపాలని కోరగా అనుమానం వచ్చి బాధితుడు సైబర్ క్రైమ్‌కు ఫిర్యాదు చేశాడు. రాజంపేట మండలంలోని అర్గొండ గ్రామానికి చెందిన కుమ్మరి అజయ్ టెలిగ్రామ్ యాప్‌లో సీఓఓఈలో చేరి ఈమెయిల్ ఐడి, సెల్ ఫోన్ నెంబర్ ఓటిపి నమోదు చేసి ఆటలో దిగాడు. గేమింగ్ క్లబ్బులో చేరి లక్షా13వేలు రూపాయలు ఏకంగా పోగొట్టుకున్నాడు.

ఉమ్మడి జిల్లాల్లో మూడేళ్ల నుండి..

2020లో 171, 2021లో 210. 2022 నుండి ఇప్పటివరకు190 వరకు కేసులు నమోదు అయ్యాయి.

జాగ్రత్తలు తప్పనిసరి..

సెల్‌ఫోన్లకు వచ్చే అనవసరమైన మెసేజ్‌లకు స్పందించవద్దని, లింకులు తెరవొద్దని, సామాజిక మధ్యమాలు, ఆకర్షణీయమైన ప్రకటనల లింకులు నొక్కితే మనకు తెలియకుండానే ఫోన్లోని పూర్తి సమాచారం కేటుగాళ్ల చేతుల్లోకి వెళ్ళిపోతుంది. సురక్షితం కానీ యాప్ డౌన్లోడ్ చేసుకోవద్దు. ఏటీఎం కార్డు వివరాలు ఓటీపీలు ఎవరికి చెప్పొద్దు. మోసపోయినట్లు గుర్తిస్తే వెంటనే సైబర్ క్రైమ్ నంబర్ 1930 కి ఫోన్ చేయాలి.

అప్రమత్తతోనే అడ్డుకట్ట...



ప్రజలు ఆన్‌లైన్ పేమెంట్లలో జాగ్రత్తగా వ్యవహరించాలి. ప్రభుత్వ పథకాల కోసం ఎవరైనా ఫోన్ చేస్తే ఎదుటి వ్యక్తి ఎవరో తెలియకుండా మాట్లాడరాదు. సంబంధిత కార్యాలయానికి వెళ్లి అధికారులను కలవాలి. ఏదైనా మోసం జరిగినట్లు గుర్తిస్తే వెంటనే డయల్ 100కు ఫోన్ చేయాలి.

సురేష్ బాబు, స్టేషన్ హౌస్ ఆఫీసర్-ఆర్మూర్

అనవసరపు యాప్‌లను నమ్మొద్దు



నేడు సోషల్ మీడియా వేదికగా అరచేతిలో ప్రపంచం చూస్తున్నాం. చదువుకున్న యువత ముఖ్యంగా విద్యార్థి నిలు, మహిళలు అనవసరపు యాప్‌లను నమ్మవద్దు.

మార గంగారెడ్డి. అంకాపూర్

కండ్లకు గంతలతో మధ్యాహ్న భోజన కార్మికుల నిరసన



కండ్లకు గంతలు కట్టుకుని నిరసన తెలుపుతున్న కార్మికులు

నవతెలంగాణ-కోటగిరి

మధ్యాహ్న భోజన కార్మికులకు మూడు వేల వేతనం పెంచుతామని రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ శాసనసభలో ప్రకటించి, అమలు చేయకుండా నిర్లక్ష్యం చేయడాన్ని నిరసిస్తూ, సీఐటీయూ ఆధ్వర్యంలో ఆదివారం కోటగిరి మండల కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తాలో కండ్లకు గంతలు కట్టుకొని వినూత్న నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా తెలంగాణ మధ్యాహ్న భోజన యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి చక్రపాణి మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు అన్నం పెట్టే మధ్యాహ్న భోజన కార్మికుల పట్ల ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించడం సరియైంది కాదని అన్నారు. తెలంగాణ శాసనసభలో ముఖ్యమంత్రి కేసీఆర్ మధ్యాహ్న భోజన కార్మికులకు మూడు వేల వేతనం పెంచుతామని ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు. కోడిగుడ్లను ప్రభుత్వమే సరఫరా చేయాలని కోరారు. లేకపోతే రానున్న రోజుల్లో సమ్మెకు దిగుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి నన్నేసాబ్, యూనియన్ మండలాధ్యక్షుడు నీరడి భూమయ్య, కార్మికులు రమణమ్మ, ఉషారాణి, పుష్ప, వెంకటలక్ష్మి, అలీ, సుశీల, అలీం తదితరులు పాల్గొన్నారు

మునిరోద్దీన్‌ను పరామర్శించిన పలువురు



పరామర్శిస్తున్న నాయకులు

నవతెలంగాణ-ముప్కాల్

బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు, మండల కో అప్షన్ సభ్యులు మునిరోద్దీన్‌కు కంటి ఆపరేషన్ కావడంతో ఆయనను ఆదివారం ఎంపీపీ భర్త, బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు సామ వెంకట్ రెడ్డి, మాజీ గ్రామాభివృద్ధి కమిటీ అధ్యక్షులు ముస్కు నర్సయ్యలు పరామర్శించారు. మునిరోద్దీన్ ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. పరామర్శించిన వారిలో బీఆర్ఎస్ పార్టీ, బీజేపీ, కాంగ్రెస్ నాయకులు, యువజన సంఘం నాయకులు, పలువురు ప్రముఖులు పరామర్శించిన వారిలో ఉన్నారు.

తాళంవేసిన ఇంట్లో చోరీ

నవతెలంగాణ-ఆర్మూర్

పట్టణంలోని మామిడిపల్లిలో తాళం వేసిన ఇంట్లో చోరీ జరిగినట్టు పోలీసులు ఆదివారం తెలిపారు. గోపారం దేవాజి శనివారం సాయంత్రం పెర్కిట్‌లోని మున్నూరు కాపు సంఘ భవనంలో భజన కార్యక్రమానికి కుటుంబ సభ్యులతో వెళ్లి రాత్రి 12 గంటలకు తిరిగి వచ్చారు. అప్పటికే తాళం ధ్వంసం చేసి రెండు లక్షలా 20వేలు, 10 తులాల బంగారు ఎత్తుకెళ్లినట్లు బాధిత వ్యక్తి తెలిపారు.. స్థానిక పోలీసులకు బాధితుడు ఫిర్యాదు చేయగా పోలీసులు వచ్చి పరిశీలించినారు.

జిల్లాలో క్రీడామైదానాలు ఏర్పాటుచేయండి

- కేటీఆర్‌కు జిల్లా ఒలంపిక్ అసోసియేషన్ వినతి

నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ

జిల్లాలో మరెన్నో క్రీడా మైదానాలు ఏర్పాటుచేయాలని జిల్లా ఒలంపిక్ అసోసియేషన్ వారు కోరారు. నిజామాబాద్ జిల్లా ఒలంపిక్ అసోసియేషన్ అధ్యక్షులు ఈగ సంజీవరెడ్డి, జనరల్ సెక్రటరీ బొబ్బిలి నర్సయ్య అసోసియేషన్ తరపున శనివారం ఐటి, పురపాలక శాఖ, అర్బన్ డెవలప్మెంట్ మంత్రివర్యులు తారక రామారావును కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నిజామాబాద్ జిల్లాలో ఎంతో కాలంగా క్రీడా మైదానాలు లేకున్నా జాతీయ, అంతర్జాతీయ క్రీడాకారలలో ప్రాతినిధ్యం వహిస్తున్నారని, ఆ కోవలోనే బాక్సింగ్‌లో నిఖత్ జరీన్, హుసామొద్దీన్, హాకీలో సౌందర్య, ఫుట్ బాల్‌లో గుగులోత్ సౌమ్య ఎవరెస్ట్ శిఖరాన్ని అధిరోహించడంలో మలావత్ పూర్ణ ఇలా యావత్ భారతదేశానికి గర్వకారణంగా క్రీడా విభాగం లో నిలిచారని అన్నారు. సౌకర్యాలు లేకుంటేనే ఇంతమంది క్రీడాకారులు జిల్లా నుండి ప్రాతినిధ్యం వహిస్తున్నారంటే సౌకర్యాలు కల్పిస్తే ఇంకా ఎంతో మంది ముందు ఉంటారని తెలిపారు. మంచి సౌకర్యాలతో క్రీడా మైదానం సింథటిక్ ట్రాక్ ఎ నిజామాబాద్ జిల్లాకు వీలైనంత తొందరగా నిర్మించాలని జిల్లా క్రీడాకారులు, క్రీడా సంఘాలు కోరుకుంటున్నాయని వివరించారు. జిల్లా ఒలంపిక్ సంఘం కార్యదర్శి జిల్లా ఒలంపిక్ సంఘానికి బ్రేడ్ అభివృద్ధికి 2013లో మూడు కోట్ల రూపాయలు విడుదల చేసినందుకు కేటీఆర్, అర్బన్ ఎమ్మెల్యే, రూరల్ ఎమ్మెల్యే కు ధాన్యవాదాలు తెలిపారు.

బెంగళూరుకు సూపర్ లగ్జరీ బస్సు ప్రారంభం

నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ

ప్రయాణికుల సౌకర్యార్థం అత్యాధునిక సౌకర్యాలతో గల నిజామాబాద్-1 డిపో నుండి నూతన సూపర్ లగ్జరీ బస్సును ప్రధాన బస్ స్టాండ్ లో ఆదివారం నిజామాబాద్ రీజినల్ మేనేజర్ ఉషాదేవి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఉషాదేవి మాట్లాడుతూ.. నిజామాబాద్ నుండి మధ్యహ్నం 1 గంటలకు బయలుదేరి మరుసటి రోజు ఉదయం 05 గంటల 45కు బెంగళూరుకు చేరుతుందన్నారు. అదే రోజు సాయంకాలం 6.30కు బెంగళూరు నుంచి బయలుదేరి మరుసటి రోజు ఉదయం 9.50 నిమిషాలకు నిజామాబాద్ చేరు



బెంగుళూరు బస్సును ప్రారంభించిన రీజినల్ మేనేజర్ ఉషాదేవి

కుంటుందని అన్నారు. ప్రయాణ చార్జీలు పెద్దలకు రూ.1320, పిల్లలకు రూ.750 ఉంటుందని తెలిపారు. ఈ సదుపాయాన్ని ఉమ్మడి జిల్లా ప్రజలందరూ ఉపయోగించుకొని, సురక్షితం, సుఖవంతమైన ప్రయాణంతో గమ్యస్థానానికి చేరుకోవాలని సూచించారు. ముందస్తు రిజర్వేషకు వెబ్ సైట్ షషష్.ంత్.షశీఅ.శ్రీఱఅవ.ఱఅని సంప్రదించాలని అన్నారు. కార్యక్రమంలో నిజామాబాద్ డిపో -1 మేనేజర్ ఎస్.ఆనంద్, ఆర్టీసి ఉద్యోగులు పాల్గొన్నారు.

కులాల అభివృద్ధికి ఉద్యోగుల కృషి అవసరం

నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ

కులాల అభివృద్ధికి ఉద్యోగుల కృషి అవసరమని రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ఎడ్ల నాగరాజు అన్నారు. మాల విద్యుత్ ఉద్యోగుల సంఘాల ఆధ్వర్యంలో రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఎడ్ల నాగరాజు ఎన్నికైన సందర్భంగా కులస్తులు శనివారం రాత్రి పవర్‌హౌస్‌వద్ద ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ఎడ్ల నాగరాజు మాట్లాడుతూ కుల సంఘాలు అభివృద్ధి చేయాలంటే ఉద్యోగుల సాయ సహకారాలు కీలకమని, ప్రతి ఒక్కరు అభివృద్ధికి సహకరించాలని ఆయన కోరారు. నిజామాబాద్ డివిజన్ అధ్యక్షులు లక్ష్మీనారాయణ, సెక్రటరీ అశోక్ కుమార్, సలహాదారులు ఏ.పోశెట్టి, కైలాస్ కుమార్, కార్యవర్గ సభ్యులు గంగాధర్, సోమేశ్, సంజీవ్, కాంతారావు తదితరులు పాల్గొన్నారు.

అరెస్టులతో పోరాటాన్ని ఆపలేరు

- జిల్లా పోలీసులకు కాంగ్రెస్ నాయకుల హెచ్చరిక

నవతెలంగాణ-కంఠేశ్వర్

అక్రమ అరెస్టులతో కాంగ్రెస్ నాయకుల పోరాటాన్ని ఉద్యమాలను ఆపలేరని జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు మానాల మోహన్ రెడ్డి, పీసీసీ ఉపాధ్యక్షులు తాహెర్‌బిన్ హందాన్, పీసీసీ ప్రధాన కార్యదర్శి గడుగు గంగాధర్ హెచ్చరించారు. ఈ మేరకు ఆదివారం నిజామాబాద్ జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో పిసిసి ప్రధాన కార్యదర్శి నగేష్ రెడ్డి తో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మోహన్ రెడ్డి మాట్లాడుతూ.. నిజామాబాద్ జిల్లాకు వచ్చిన రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి కేటీఆర్‌కు మున్సిపాలిటీలోని సమస్యలపై మెమోరండం ఇవ్వడానికి వెళ్లిన కార్పొరేటర్ గడుగు రోహిత్‌పై పోలీసులు మ్యాన్ హ్యాండిలింగ్ చేస్తూ అరెస్టు చేయడం అధికార పార్టీకి తొత్తులుగా మారారా చెప్పడానికి నిదర్శనమని అన్నారు.

పిసిసి ప్రధాన కార్యదర్శి గడుగు గంగాధర్ మాట్లాడుతూ.. గడుగు రోహిత్ ముందస్తు అరెస్టు చేయడానికి వచ్చిన పోలీసులు ఇంటి చుట్టూ పోలీసులు బలగాలను పెట్టి ప్రజలను



సమావేశంలో మాట్లాడుతున్న మానాల మోహన్‌రెడ్డి

భయభ్రాంతులకు చేశారని ఆయన అన్నారు. తమ ఉద్యోగాలను కాపాడుకోవడానికి పోలీసులు మంత్రి కాన్వాయ్‌ను అడ్డుకున్నారని అక్రమ కేసులు పెట్టారని తెలపారు. బెయిలు రాకుండా కేసులు పెట్టారని అన్నారు. సమావేశంలో జిల్లా కిసాన్ కాంగ్రెస్ అధ్యక్షులు ముప్పగంగారెడ్డి, జిల్లా ప్రచార కమిటీ చైర్మన్ జావిద్ అక్రమ్, జిల్లా ఓబీసీ అధ్యక్షులు రాజ నరేంద్ర గౌడ్, నిజామాబాద్ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు మహేష్, జిల్లా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి సిరికొండ గంగారెడ్డి, నగర ఎస్టి సెల్ అధ్యక్షులు సుభాష్ జాదవ్, రాష్ట్ర ఎస్సీ సెల్ కన్వీనర్ సాయిలు, తదితరులు పాల్గొన్నారు.

క్రమశిక్షణతో చదువుకొని ఉన్నత స్థాయికి ఎదగాలి



విద్యార్థుల నృత్యప్రదర్శన

నవతెలంగాణ-ఆర్మూర్

విద్యార్థులు చిన్ననాటి నుంచి క్రమశిక్షణతో చదువుకొని ఉన్నత స్థాయికి ఎదగాలని అంకాపూర్ భార్గవి విద్యానికేతన్ ప్రిన్సిపాల్ ప్రగతి పట్వారి అన్నారు. మండలంలోని అంకాపూర్ భార్గవి విద్యానికేతన్ పాఠశాల వార్షికోత్సవం శనివారం సాయంత్రం సంబరంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థులు ఉన్నత స్థాయిలో స్థిరపడి, తిరిగి సమాజానికి సేవ చేయాలని అన్నారు. చిన్నారుల నృత్యాలు చూపర్లను ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ గోపికృష్ణ, వాసు, హారిక, సుస్మిత, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

బషీరాబాద్‌లో చలిబోనాల సందడి



ఆలయంవద్ద బోనాలు వేస్తున్న మహిళలు

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

మండలంలోని బషీరాబాద్ గ్రామంలో ఆదివారం చలి బోనాల సందడి నెలకొంది. ముత్యాల పోచమ్మ, ఐదుచేతుల అమ్మవారి ఆలయాల వద్దకు హరిజన కులస్తులు కుటుంబ సమేతంగా వచ్చి చలి బోనాలు సమర్పించారు. బెల్లపు నైవేద్యాలు, కాల్లు పోసి కొబ్బరికాయలు కొట్టి మొక్కులు సమర్పించారు. కార్యక్రమంలో హరిజన సంఘ కుటుంబ సభ్యులు, పార్వతి రాజు, ప్రకష్, ప్రసాద్, శ్రీనాథ్, మహిళలు పాల్గొన్నారు.

ఆలూరులో గ్రామ దేవతలకు జలాభిషేకం



గంగాజలాలతో ఆలయాలకు వెళ్తున్న గ్రామస్తులు

నవతెలంగాణ-ఆర్మూర్

ఆలూరు మండలకేంద్రంలో ఆదివారం గ్రామ దేవతలకు జలాభిషేకం నిర్వహించారు.. గోదావరి నుంచి నీటిని తీసుకువచ్చి గ్రామ దేవతలకు జాలబిషేకం నిర్వహించారు. గ్రామంలోని ప్రజలంతా సుఖ సంతోషాలతో ఉండాలని, పంటలు బాగా పండాలని, గ్రామ ప్రజలు రోగాల బారిన పడకుండా కాపాడాలని ప్రత్యేక పూజలు నిర్వహించారు. వీడీసీ కార్యాలయం నుంచి ప్రారంభమైన శోభాయాత్ర అన్ని దేవాలయాలను కలుపుతూ గ్రామ ప్రధాన వీధుల గుండా కొనసాగింది. కార్యక్రమంలో జిల్లా రైతు బంధు సమితి డైరెక్టర్ ఆలూరు శ్రీనివాస్ రెడ్డి, సర్పంచ్ కళ్లెం మోహన్ రెడ్డి, ఉప సర్పంచ్ శ్రీనివాస్, ఎంపీటీసీ మల్లేష్, గ్రామాభివృద్ధి కమిటీ అధ్యక్షుడు బార్ల గణపతి, కళ్లెం సాయిరెడ్డి, ఎడ్ల పోశెట్టి, రఘుపతి, కొత్తూరు గిరీష్, సంజీవ్, నారాయణ, గ్రామ అభివృద్ధి కమిటీ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఒత్తిళ్లను ఎదుర్కొనేందుకు యోగా

- మామిడిపల్లిలో 16 ఏండ్లుగా యోగా కేంద్రం



యోగాకు హాజరైన పలువురు

నవతెలంగాణ-ఆర్మూర్

పట్టణంలోని మామిడిపల్లి ఉన్నత పాఠశాలలో 16 సంవత్సరాల నుండి యోగా చేస్తూ పలువురికి ఆదర్శంగా నిలుస్తున్నారు విజ్ఞాన యోగ మందిర్ వారు ఆదివారం మాట్లాడుతూ దైనందిన జీవితంలో తలెత్తే ఒత్తిళ్లను ఆటుపోట్లను ఎదుర్కొనేందుకు యోగ ఎంతో ఉపయుక్తమని అన్నారు. పట్టణంతోపాటు పెర్కిట్, మామిడిపల్లి నుండి ఇక్కడకు చేరుకొని యోగతో పాటు ధ్యానం చేస్తున్నారు. దీనిగురించి అందరికీ తెలియజేస్తున్నారు. విశ్రాంత మండల విద్యాధికారి క్రీర్తి శేషులు యోగ భీమయ్య దగ్గర శిష్యులుగా మెలకువలు నేర్చుకొని యోగ సాధనలో జిల్లాలోనే ఆదర్శంగా నిలుస్తున్నారు. కార్యక్రమంలో ముక్క సూరజ్, సాయన్న, గంగారాం ,రేపల్లి దత్తు, దై శ్రీనివాస్, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

- ఆర్థిక సహాయం అందించిన సునీల్ రెడ్డి

నవతెలంగాణ-ఏర్గట్ల

మండలంలోని దోంచంద గ్రామానికి చెందిన బొట్ల రమేష్ ఇటీవల అనారోగ్యంతో మరణించడంతో ఆయన కొడుకు చిన్నవయసులోనే అనాధగా మారాడు. విషయం తెలుసుకున్న ఆరెంజ్ ట్రావెల్స్ అధినేత ముత్యాల సునీల్ కుమార్ బాధిత కుటుంబాన్ని ఆదివారం పరామర్శించారు. ఈసందర్భంగా రూ.10వేలు ఆర్థిక సహాయం అందించారు. ఆయన వెంట సునీల్‌సేన సభ్యులు బెజ్జారం భాను, పాలెపు నర్సయ్య, తదితరులున్నారు.

కంటివైద్య శిబిరం


కంటిపరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

నవతెలంగాణ-లింగంపేట్

మండల కేంద్రంలో ఆదివారం మదన్‌మోహన్ ట్రస్ట్ ఆధ్వర్యంలో కంటివైద్య శిబిరం నిర్వహించినట్టు కాంగ్రెస్ మండల అధ్యక్షులు నల్లమడుగు షరీఫ్ తెలిపారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు సుమారు 1500 మందికి కంటి పరీక్షలు నిర్వహించి అవసరమున్న వారికి కంటి అద్దాలు, మందులు పంపిణీ చేసినట్టు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ గాంధారి మండల అధ్యక్షులు తూర్పు రాజు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ధ్వజ స్తంభం ఏర్పాటుకు విరాళం

నవతెలంగాణ-సదాశివనగర్

మండలంలోని యాచారంలోని శ్రీ జగదాంబ శ్రీ సంత్ సేవాలాల్ మహారాజు ఆలయంలో ధ్వజస్తంభం ఏర్పాటుకు పలువురు విరాళాలు అందజేసినట్టు గ్రామస్తులు తెలిపారు. మాజీ ఎమ్మెల్యే ఏనుగు రవీందర్ రెడ్డి 25,116 రూపాయలు, పైళ్ల క్రిష్టారెడ్డి రూ.10,000 విరాళాలుగా అందించినట్టు గ్రామస్తులు ఆదివారం తెలిపారు. ఈ సందర్భంగా గ్రామస్తులు విరాళం అందజేసిన వారికి కృతజ్ఞతలు తెలిపారు. ఆలయ అభివృద్ధికి దాతలు ముందుకు రావాలని కోరారు.

అధికారంలోకి రాగానే బీడీ కార్మికులకు ఈఎస్ఐ ఆస్పత్రి

- బీడీ కార్మికులు, టేకేదారులతో మాజీ మంత్రి షబ్బీర్ అలీ


సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి షబ్బీర్ అలీ

నవతెలంగాణ-కామారెడ్డిటౌన్

కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే బీడీ కార్మికుల కోసం కామారెడ్డిలో ఈఎస్ఐ ఆసుపత్రి ఏర్పాటు చేస్తామని మాజీ మంత్రి షబ్బీర్ అలీ అన్నారు. ఆదివారం కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యాలయంలో బీడీ కార్మికులతో, టేకేదారులతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. తెలంగాణ జిల్లాలో ఏడు లక్షల బీడీ కార్మికులు 14 బీడీ పరిశ్రమల ద్వారా ఉపాధి పొందుతున్నారని అన్నారు. మోడీ ప్రభుత్వం బీడీపై 28 శాతం జీఎస్టీ పెట్టి సగం బీడీ వ్యవస్థను చంపిందని, కేంద్ర ప్రభుత్వం పార్లమెంటులో తీర్మానం చేసి బీడీ రోలింగ్ వ్యవస్థను రద్దు చేసి పూర్తిగా చంపేప్రయత్నం చేస్తే కాంగ్రెస్ పార్టీ ప్రతిపక్ష పార్టీలన్నీ ఏకంచేసి ఇప్పటికైతే బీడీ వ్యవస్థను రద్దు కాకుండా ఆపగలిగామని తెలిపారు. 'బీడీ కార్మికుల పరిస్థితి అత్యంత దయ నీయంగా మారింది. బీడీ కట్టలపై పుర్రె గుర్తు ముద్రణ చాలా రోజుల పాటు సంక్షోభాన్ని సృష్టించగా జీఎస్టీ విధింపుతో పరిస్థితి మరింత విషమించింది. ప్రతిరోజు 19 గంటలు బీడీలు చుట్టడం కోసం కష్టపడుతున్న బీడీ కార్మికులకు ప్రస్తుతం ఏ రోజు కూడా కడుపు నిండా తిండి లేని పరిస్థితి నెలకొంది. పొగాకు ఉత్పత్తులతో పనులవల్ల బీడీ కార్మికులు రక్తహీనత, నరాల బలహీనత, క్యాన్సర్, క్షయ, శ్వాసకోశ వ్యాధుల బారిన పడుతున్నారని' తెలిపారు. కార్మికుల సౌకర్యార్థం కామారెడ్డి జిల్లా కేంద్రంలో ఈఎస్ఐ ఆస్పత్రి ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు.

ప్రత్యేక ప్రవాసి సంక్షేమ బోర్డు ఏర్పాటుచేయాలి

- దుబాయిలో ఎన్నారై సంఘాల సంయుక్త సమావేశంలో తీర్మానం


అభివాదం చేస్తున్న ప్రతినిధులు

నవతెలంగాణ-ఆర్మూర్

మైగ్రేండ్స్ రైట్స్ అండ్ వెల్ఫేర్ ఫోరం ఆధ్వర్యంలో దుబాయ్‌లోని ఒక ప్రైవేటు హోటల్లో ఆదివారం సమావేశమయ్యారు. యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ కేంద్రంగా గల్ఫ్ కార్మికులకు సేవ చేస్తూ వారి డిమాండ్ల సాధనకు అనేక సంవత్సరాలుగా పోరాడుతున్నామని ప్రవాస భారతీయుల హక్కుల సంక్షేమ వేదిక అధ్యక్షులు కోటపాటి నరసింహనాయుడు తెలిపారు. తెలంగాణ ప్రభుత్వానికి అనేక డిమాండ్లు, సూచనలు చేస్తూ తీర్మానించినట్టు చెప్పారు. తెలంగాణ రాష్ట్రంలో గల్ఫ్ కార్మికులు, ఉద్యోగుల కోసం ఎన్నారై పాలసీ అమలు చేసి ఒక ప్రత్యేక బోర్డు గాని కార్పొరేషన్ గాని ఏర్పాటు చేసి 500 కోట్ల నిధులు కేటాయిస్తారని ఆశించారు. అధికారంలోకి రాకముందే టీఆర్ఎస్ పార్టీ తమ ఎన్నికల ప్రణాళికలో చేసిన వాగ్దానం నెరవేరుస్తారని ఆశించారు. 2018 బడ్జెట్లో 100 కోట్ల ఎన్నారైల సంక్షేమం కోసం కేటాయించి కూడా ఒక్క రూపాయి ఖర్చు పెట్టలేదన్నారు. కనీసం టీఆర్ఎస్ పార్టీ ప్రభుత్వం రెండవ టర్ములోనైనా చివరి బడ్జెట్లోనైనా 500 కోట్లు కేటాయించి ప్రత్యేక ప్రవాసి సంక్షేమ బోర్డు లేదా కార్పొరేషన్ ఏర్పాటు చేయాల్సిందిగా అన్ని సంఘాలు ముక్తకంఠంతో డిమాండ్ చేశాయని తెలిపారు. సమావేశంలో ఎంఆర్ఎఫ్ దుబాయ్ కోఆర్డినేటర్ పాటుకూరి తిర గాయకుడు జువాడి శ్రీనివాసరావు, గల్ఫ్ తెలంగాణ సంక్షేమ అసోసియేషన్ జీటీడబ్ల్యూ గుండెల్లి నరసింహులు, గల్ఫ్ సంక్షేమ సంఘం జి డబ్ల్యూ పిసి భూమయ్య, వ్యవస్థాపక జీడబ్ల్యూడబ్ల్యూసి ఉట్నూరి రవి, దుబాయ్ ఎలాల శీనన్న, సేవాసమితి బాలు, బొమ్మాడి బాబురావు, సార్లా మహేందర్, కే.మహేందర్, వంశి గౌడ్, కోరేపి మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

ఏసీడీ చార్జీలను వెనక్కి ఇచ్చేయండి

- సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ


మాట్లాడుతున్న ఆకుల పాపయ్య

నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ

పేద ప్రజల నుండి వసూలు చేసిన ఏసీడీ చార్జీలను వెంటనే వెనక్కి ఇచ్చేయాలని సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి ఆకుల పాపయ్య అన్నారు. ఆదివారం నగరంలోని ఎన్ఆర్ భవన్ లో మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... సీఎం కేసీఆర్ నాయకత్వంలతో విచ్చలవిడిగా పెంచుతున్న విద్యుత్ ఛార్జీల వల్ల ప్రజలపై ఆర్థిక భారం పడుతుందన్నారు. చార్జీలతో పాటు టారీఫ్ రేట్లు, యూనిట్ల స్లాబ్‌రేటు మార్చడంతో ఇబ్బంది పడుతున్న ప్రజలపై గత సంవత్సరం లోడ్ డిపాజిట్ పేరుతో ఒక్కో మీటర్‌పై 2000 నుండి 5000 వరకు ప్రభుత్వం రాబట్టిందన్నారు. మళ్ళీ ఏసీడీ డిపాజిట్ల పేరుతో రెండు నెలల కరెంటు బిల్లును అడ్వాన్స్ డిపాజిట్ భారాన్ని మోపడానికి సిద్ధమైందన్నారు. అడ్వాన్స్ డిపాజిట్‌ను ఫిబ్రవరి నెలలో కట్టాలని విద్యుత్ సంస్థ అధికారులు బిల్లులో కలిపి ఈపాటికే అందరికీ అందించారని తెలిపారు. సంస్థ సిఎండి గోపాల్ రావు మొండి బకాయిలు పెరగడంతోటే డిపాజిట్లు వసూలు చేస్తున్నామని నిస్సిగ్గుగా చెప్పడంతోపాటు బకాయిలు వసూలు చేయడంలో విఫలయ్యారన్నారు. బకాయిలు ఉన్న వారి బిల్లును, సక్రమంగా చెల్లించే వినియోగదారుడు ఎందుకు ఏసీడీ డిపాజిట్ చెల్లించాలో ప్రజలు ఆలోచించాలని అన్నారు. విద్యుత్ చార్జీల దోపిడీని ఆపకపోతే నిరసన కార్యక్రమాలు తప్పవని తెలిపారు. సమావేశంలో ఏఐకెఎంఎస్ జిల్లా అధ్యక్షులు వేల్పూర్ భూమయ్య, న్యూ డెమోక్రసీ నాయకులు నీలం సాయిబాబా, దేశెట్టి సాయి రెడ్డి, జెపి గంగాధర్, మురళి పాల్గొన్నారు.

తడిపొడితో.. దిగుబడి

- వరి సాగులో నూతన విధానం
- క్షేత్రస్థాయిలో రైతులకు అవగాహన కల్పిస్తున్న వ్యవసాయశాఖ
- నీటితోపాటు సమయమూ ఆదా అవుతుందని వెల్లడి


పొలంలో ఏర్పాటు చేసిన ఉన్న పైపు


క్షేత్రస్థాయిలో వరి పొలంలో రైతులకు అవగాహన కల్పిస్తున్న వ్యవసాయాధికారులు, స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు

నవతెలంగాణ-భిక్కనూర్

తడి, పొడి... ఈ పదం వింటే ఏదో చెత్త వేరు చేయడం కోసం అనుకుంటే పొరపడినట్టే. వరి సాగులో నూతన విధానంపై వ్యవసాయాధికారులు గ్రామాల్లో క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ అవగాహన కల్పిస్తున్నారు. తక్కువ నీటితో వరి పంటను సాగు చేయవచ్చని, నీటి పొదుపుతో పాటు పంటకు చీడలపీడల బెడద ఉండబోదని, దిగుబడి కూడా పెరగనుందని అధికారులు పేర్కొంటున్నారు. పంటలో నీటి సామర్థ్యాన్ని కొలిచి అవసరమైనంత మేరకే నీటిని ఉపయోగించుకుంటూ తక్కువ శ్రమతో అధిక లాభాలు పొందే అవకాశం ఉందని అవగాహన కల్పిస్తున్నారు.

ఒక కిలో వరి పండించడానికి 4-5 వేల లీటర్ల నీరు అవసరం అవుతుంది. ఇది ఇతర పంటల సాగుకంటే రెండు నుంచి మూడు రేట్లు ఎక్కువ. తక్కువ నీటితో ఎక్కువ ఉత్పాదకత సాధించాల్సిన అవసరం ఉంది. నీరు ఎక్కువ వాడడం కారణంగా మిథెన్ వాయువు ఎక్కువై వాతావరణ కాలుష్యం ఏర్పడుతుంది. దీంతో పాటు నీటి కొరత ఉన్న వారు వరి సాగుకు దూరంగా ఉంటారు. ఈ రెండు సమస్య లను పరిష్కరించే దిశగా శాస్త్రవేత్తలు పలు పరిశో ధనలు తడిపొడి విధానం తీసుకొచ్చారు. పంటకు నీరు పెట్టడం, ఆర బెట్టడం పద్ధతి అవలంభిస్తే ఎంతగానో ఉపయోగ పడనుందని వ్యవసాయాధికారులు చెబుతున్నారు.

కోర్ కార్బన్ ఎక్స్ సొల్యూషన్ హైదరాబాద్ వారి సహకారంతో పద్మపాణి స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో కామారెడ్డి జిల్లా వ్యాప్తంగా వరి పంట రైతులకు అవగాహనా సదస్సులు నిర్వహిస్తున్నారు. వ్యవసాయ దారుల వద్దకు వెళ్లి ఏ విధంగా తడి పొడి విధానాన్ని నిర్వహించాలి, వచ్చే లాభాలు, ఉపయోగాలు, తదితర విషయాలు ప్రయోగాత్మకంగా రైతులకు వివరిస్తున్నారు.

తడిపొడి విధానం నిర్వహించు పద్ధతి..

పొలంలో వరి నాటు వేసి, మొదటి కలుపు తీసిన తర్వాత నీటి తడి పొడి విధానం అవలంభించాల్సి ఉంటుంది. ఇందు కోసం 30 సెంటీమీటర్ల వ్యాసం గల రంధ్రాల గొట్టాన్ని ఉపయోగించాల్సి ఉంటుంది. దాన్ని పది సెంటీమీటర్ల వరకు లోపలికి దించి గొట్టంలోని మట్టిని తీసేయాలి. ఐదు సెంటీమీటర్ల వరకు నీరు ఉండే విధంగా చూసుకుంటూ ఉండాలి. అంతకు మించి నీరు పెట్టొద్దు.

తడి పొడి విధానం ఉపయోగాలు..

తడి పొడి విధానం ద్వారా చీడపురుగుల నివారణ, దోమపోటు, మిథెన్ వాయువు తగ్గింపు, తక్కువ నీరు వాడకం, ప్రతిసారి నీరు పెట్టకుండా రంధ్రాల గొట్టంలో నీరు చూసుకొని నీరు పారపెట్టుకోవచ్చు. ఈ విధానాన్ని అమలు చేయడం వలన వరి పంటకు వేరు వ్యవస్థ బలపడి, పైర్లకు గాలి ఆడడం, పిలుకలు ఎక్కువగా రావడం, సుమారు ఎకరాకు మూడు నుండి ఐదు గంటల వరి పంట ఎక్కువగా వస్తుంది.

అమలు చేయు పద్ధతి..

వరి పంట నాటు వేసి మొదటి కలుపు తీసిన సమయం నుండి సుమారు 30 నుండి 90 రోజుల మధ్య నుండి పొట్ట దశ వచ్చేవరకు తడి పొడి విధానాన్ని అమలు చేయాలి. సుమారు రెండు నెలల తడి పొడి విధానం ఉపయోగపడుతుంది.

ప్రతిసారి వరి పంటకు నీరు పెట్టకుండా నీరు ఎంత ఉందో రంధ్రాల గొట్టంలో చూసుకోవడం ద్వారా రైతులకు శ్రమ తగ్గుతుంది. నీరు తగ్గినప్పుడు నీరు పార పెట్టడం, ఉన్నప్పుడు నీరు పెట్టకుండా సమయం, శ్రమ, పురుగు పట్టకుండా ఉండడం, అధిక దిగుబడి వంటి ఉపయోగాలున్నాయి.

సంస్థ నుండి సహకారం..

తడి పొడి విధానాన్ని అమలు చేస్తే కార్బన్ ఎక్స్ సొల్యూషన్ హైదరాబాద్ సంస్థ ఎకరానికి 800 రూపాయలు ప్రోత్సాహం కింద అందజేస్తుంది. తడి పొడి విధానాన్ని ప్రతి రైతు అమలు చేయాలని ఉద్దేశంతో ప్రోత్సాకాన్ని అందిస్తున్నారు.

నీటి పొదుపు.. చీడపీడల నివారణ

డీఏవో భాగ్యలక్ష్మి



తడి పొడి విధానం ద్వారా రైతులు వరి పంటలో నీరు ఎంతవరకు ఉన్నదో చూసుకోవడానికి ఉపయోగకరంగా ఉంటుంది. దీంతో పాటు నీటి పొదుపు, మిథెన్ వాయువు నివారణ, చీడ పరుగులు నివారణతో పంటలు సమృద్ధిగా పండుతాయి. అధిక దిగుబడి బస్తుంది.

ఎమ్మెల్యే అమ్ముడుపోయాడని ఆత్మసాక్షిగా చెప్పగలవా..?


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

- కాంగ్రెస్ నాయకులకు బీఆర్ఎస్ నాయకుల సూటి ప్రశ్న

నవతెలంగాణ-రామారెడ్డి

కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో జరగని అభివృద్ధి బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో జరిగిందని, మాజీ మంత్రి షబ్బీర్ అలీ చేయని పనులు ఎమ్మెల్యే సురేందర్ ఆధ్వర్యంలో చేస్తున్నామని బీఆర్ఎస్ నాయకులు అన్నారు. ఎమ్మెల్యే సురేందర్ డబ్బులకు అమ్ముడుపోయారని ఆరోపిస్తున్న సుభాష్ రెడ్డి.. కాలభైరవ దేవస్థానం వచ్చి గర్భగుడిలో ఆత్మ సాక్షిగా చెప్పగలరా అని ప్రశ్నించారు. మండల కేంద్రంలోని గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద మండల బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ఆదివారం విలేకరుల సమా వేశం నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ కతమైందని, నాయకులు కండ్లు లేని కబోద లుగా మాట్లాడు తున్నారని మండల రైతుబంధు అధ్యక్షులు గురజాల నారాయణరెడ్డి, పార్టీ మండల అధ్యక్షులు రవీందర్ గౌడ్ అన్నారు. సురేందర్ కాంగ్రెస్ నుంచి గెలువలేదని, తెలంగాణ ఉద్యమకారుడిగా గెలిచాడని అన్నారు. 60 సంవత్సరాల్లో కాంగ్రెస్ ఏం చేసిందని ప్రశ్నించారు. ఉప్పల్వాయి, మోషన్ పూర్ రోడ్డుకు సిసి రోడ్ కింద రూ, 40 లక్షలు మంజూరయ్యాయని, ప్రజల సౌకర్యార్థం బీటీ రోడ్డు కావాలంటే, తిరిగి ఎమ్మెల్యే ప్రపోజల్ పంపారని, గ్రామ గ్రామాన అభివృద్ధి చేసి, అనారోగ్యంతో ఆసుపత్రిలో ఉంటున్న ప్రజలను ఆదుకున్నది ఎమ్మెల్యే సురేందర్ అని అన్నారు. నాగార్జునసాగర్, మునుగోడు, దుబ్బాక, హుజురాబాద్ లో డిపాజిట్ కోల్పోయిన కాంగ్రెస్ కోసం సమావేశాలు ఏర్పాటు చేసి, నోటికి వచ్చిన భాషతో మాట్లాడటం మంచిది కాదని హెచ్చరించారు. ఫ్లోర్ లీడర్ అంటే ప్రజా సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకుపోవాలని, కానీ చిల్లర రాజకీయం చేయవద్దని అన్నారు. అక్కడక్కడ రూ, 2000 ఆర్థిక సహాయం అందించడం కాదని, ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ దండబోయిన సంజీవ్, రాజనర్సు, కొత్తొల్ల గంగారం, ఎంపీటీసీ ప్రవీణ్ గౌడ్, నాయకులు రాజేందర్ గౌడ్, కందూరి లింబాద్రి, పోతు నూరి ప్రసాద్, రాజేందర్, కిషన్ గౌడ్ ఉన్నారు.

పదోన్నతిపై వెళ్తున్న బీపీఎంకు సన్మానం


బీపీఎంను సన్మానిస్తున్న సర్పంచ్, గ్రామస్తులు

నవతెలంగాణ-పిట్లం

ప్రభుత్వ ఉద్యోగురలకు బదిలీలు అనివార్యమేనని సర్పంచ్ గోపాల్‌రెడ్డి అన్నారు. బీపీఎం సతీష్ హైదరాబాద్ పట్టణానికి పోస్టుమాన్‌గా పదోన్నతిపై బదిలీ కావడంతో మండలంలోని హస్నాపూర్‌లో గ్రామపంచా యతీ కార్యాలయం వద్ద ఆదివారం వీడ్కోలు సమావేశం నిర్వహించి బీపీఎంను సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తిమ్మానగర్ తంతి తపాలా కార్యాలయ పరిధిలోని హస్నాపూర్, మార్దాండ గ్రామాల ప్రజలకు తొమ్మిదిన్నరేళ్ల పాటు విశేస సేవలు అందించారని గుర్తు చేశారు. రాష్ట్ర ప్రభుత్వం పంపిణీ చేస్తున్న పెన్షన్‌లను సకాలంలో అందించి లబ్ధిదారుల మన్ననలు పొందారి అన్నారు. ఈ కార్యక్రమంలో ఫిరోజ్ , సురేష్ , దత్త గౌడ్ , మల్లేష్ , సైదులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు పరిశీలన

నవతెలంగాణ-జుక్కల్

మండలంలోని మహమ్మదాబాద్ గ్రామ పంచాయతీలో జీపీ నిధులతో కల్వర్టు, మురికి కాలువల నిర్మాణాలు సర్పంచ్ సాయులు ఆధ్వర్యంలో చేపడుతున్నామని జేపిఎస్ జీవన్ తెలిపారు. ఆదివారం సర్పంచ్ పనులు పరిశీలించిమాట్లాడారు. మురికి కాలువల నిర్మాణాలను పలు కాలనీలలో పూర్తయ్యాయని, మరికొన్ని కాలనీల్లో కల్వర్టులతో పాటు కాలువల నిర్మాణ పనులు చేపడుతున్నట్టు తెలిపారు. మరికి నీరు ఊరవతలికి పంపేలా ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు.

బ్రిడ్జి ప్రారంభోత్సవంలో వివాదం

- మల్లాపూర్-లోలం గ్రామాల్లో తీవ్ర ఉద్రిక్తత
- ప్రారంభోత్సవాలు చేయకుండానే వెనుదిరిగిన ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ


చర్చించుకుంటున్న గ్రామస్తులు


వివాదానికి దారి తీసిన శిలాఫలకం


గుమిగూడిన గ్రామస్తులు

నవతెలంగాణ-డిచ్‌పల్లి

ఏండ్లుగా బ్రిడ్జి నిర్మాణం కోసం లోలం-మల్లాపూర్ గ్రామాల ప్రజలు ఎదురుచూశారు. అప్పటి పంచాయతీ రాజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావును నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్దన్ బ్రిడ్జి నిర్మాణానికి గ్రామాలకు తీసుకొని వచ్చి బ్రిడ్జి అవశ్యకతను చూయించారు. ఇరువురు కలిసి శంకుస్థాపన చేయకుండానే బ్రిడ్జి నిర్మాణానికి నాలుగున్నర కోట్ల నిధులను కేటాయించారు. నిర్మాణం పూర్తి చేసుకొని.. నాలుగైదేండ్లు అయినా ప్రారంభోత్స వానికి నోచుకోలేదు. ఎట్టకేలకు ఆదివారం ప్రారంభోత్సవానికి ముహూర్తం కుదిరింది. బ్రిడ్జికి రంగులు వేసి అలంకరించారు. ఇరు గ్రామాల ప్రజలు ప్రారంభోత్సవ ఘట్టానికి సిద్ధమైయ్యారు. ఈ క్రమంలో శిలాఫలకం ఏర్పాటు విషయంలో ఇరు గ్రామస్తుల మధ్య వివాదం నెలకొంది. దీంతో ఉద్రిక్త పరిస్థితులు నెలకొనడంతో ప్రారంభోత్సవం చేయకుండానే ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ వెనుదిరిగారు.

మల్లాపూర్, లోలం గ్రామాలలో ఆదివారం బ్రిడ్జితో పాటు వైకుంఠధామాలు, క్రీడా ప్రాంగణాలు, గ్రామపంచాయతీ భవనం, సిసి రహదారులు, వైకుంఠధామాలు, రైతు వేదిక, మహిళా సంఘ భవనాలు, కమ్యూనిటీ భవనాల ప్రారంభోత్సవానికి ఏర్పాట్లు పూర్తి చేశారు. ప్రారంభోత్సవాలకు ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్దన్, ఎమ్మెల్సీ వీజీగౌడ్ పర్యటన సైతం ఖరారు అయింది. అయితే మల్లాపూర్ గ్రామంలో ప్రారంభోత్సవాలు చేసుకుని లోలంలో ప్రారంభోత్సవాలు చేపట్టాల్సి ఉండగా శనివారం రాత్రి నుండే ఇరు గ్రామాలలో శిలఫలకం విషయమై తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. బ్రిడ్జి ఇరు గ్రామాల సరిహద్దులో ఉండటంతో లోలం పంచాయతీ పేరుతో శిలాఫలకాన్ని బ్రిడ్జికి అవతల ఏర్పాటు చేయడం పట్ల మల్లాపూర్ వాసులు అభ్యంతరం వ్యక్తం చేశారు. కాగా బ్రిడ్జి అవతల వరకు తమ గ్రామ సరిహద్దు అని లోలం వాసులు పేర్కొన్నారు. ఈ విషయమై ఆర్టీసీ చైర్మన్ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్దన్ దృష్టికి తీసుకొని వెళ్లగా ఇరు గ్రామాల సరిహద్దుల్లో ఉన్న బ్రిడ్జి మధ్యలో శిలాఫలకం వేసుకోవాలని ఎమ్మెల్యే వారికి సూచించినట్లు సమాచారం.

అయి తే లోలం గ్రామ స్తులు మల్లా పూర్ సరిహద్దు వైపున శిలాఫ లకం పెట్టారు. ఎమ్మె ల్యే మల్లాపూర్ గ్రామంలో అభివృద్ధి ప్రారంభోత్సవాల్లో పాల్గొని ఇక్కడి నుండే లోలంకు వస్తు బ్రిడ్జి వద్ద ఉన్న శిలఫలకాన్ని ఆవిష్కరిస్తారని లోలం గ్రామస్తులు ఆడ, మగా తేడా లేకుండా డప్పువాయిద్యాలతో బ్రిడ్జి వద్దనే స్వాగతం పలికడానికి వేచి ఉన్నారు. అంతకు ముందు మల్లాపూర్ గ్రామస్తులు బ్రిడ్జి విషయమై ఎమ్మెల్యే దృష్టికి తీసుకొని వచ్చారు. ఇరు గ్రామా లు శాంతియుతంగా సమస్య ను పరిష్కరించుకోవాలని సూచించి బ్రిడ్జి సమస్య పరిష్కారం అయ్యే వరకు ప్రారంభో త్సవం చేయవద్దని ఒక ఆలోచన తో ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్దన్ మల్లాపూర్ నుండి సరిహద్దు గుండా కాకుండానే ఇందల్వాయి మండల కేంద్రంలోని తిర్మన్ పల్లి, ఎల్లారెడ్డిపల్లి మీదుగా తిరిగి లోలం గ్రామంలోని మల్లికార్జున స్వామి ఆలయం వద్దకు వచ్చి గంటసేపు వేచి ఉన్నారు. కానీ ఏ ఒక్కరు కూడా గ్రామంలో ఉండకుండా గ్రామం అంత బ్రిడ్జి వద్దనే ఉండి ఎమ్మెల్యే ఇక్కడికి వచ్చి ప్రారంభోత్సవాలు చేస్తేనే గ్రామంలోకి వస్తావని పట్టు పట్టి అక్కడే బైఠాయించి కూర్చున్నారు. అంతలోనే మల్లాపూర్ గ్రామస్తులు కొందరు బ్రిడ్జి వైపు రాగా అది గమనించిన లోలం గ్రామస్తులు ఒకరిపై ఒకరు దాడులు చేసుకోవడానికి సిద్ధపడ్డారు. పోలీసులు రంగ ప్రవేశం చేసి గ్రామస్తులను చెదరగొట్టారు. కొందరి చేతుల్లో కట్టెలు రాళ్లు ఉండటంతో ఇరు గ్రామాల మధ్య తీవ్ర ఘర్షణ వాతావరణం నెలకొనడంతో ఎస్సై నరేష్ కుమార్ సిబ్బందితో పహేర కాశారు.

రూరల్ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్దన్ శిలావలకం ప్రారంభించకపోవడంతో లోలం గ్రామస్తులు వాగు పైన భారీ ఎత్తున మహిళలు గ్రామస్తులతో కలిసి బైఠాయించారు. మల్లాపూర్ గ్రామానికి ఎలాంటి సంబంధం లేదని, అధికారులు ఇచ్చిన ప్రోటోకాల్ ప్రకారమే తమ శిలాఫలకంపై పేర్లు రాయించామని అది ముమ్మటికి తమ గ్రామ శివారులోనే ఉండటంతో శిల పలాకాన్ని పెట్టుకున్నామని లోలం గ్రామస్తులు చెప్పారు. మా గ్రామానికి సరిహద్దుగా ఉన్న చోట పెట్టకుండా లోలం గ్రామ సరిహద్దు వైపు పెట్టుకోవాలని మల్లాపూర్ గ్రామస్తులు సూచిస్తున్నారు. కావాలనే మల్లాపూర్ గ్రామస్తులు ఉద్రిక్తత సృష్టిస్తున్నారని లోలం గ్రామస్తులు ఆరోపించారు.

ఇరు గ్రామాల ప్రజల తీరుతో.. గత కొన్ని రోజులుగా గ్రామంలో అభివృద్ధి కార్యక్రమాలు ప్రారంభించడానికి వారం నుండి అన్ని సిద్ధం చేసిన ప్రజా ప్రతినిధులు గ్రామస్తులు నిస్సహాయంగా చూస్తూ ఉండిపోవలసి వచ్చింది. ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్దన్ ఎమ్మెల్సీ వి గంగాధర్ గౌడ్ తో పాటు ప్రజాప్రతినిధులు ధర్పల్లి మండలంలోని రామడుగు ప్రాజెక్టు నుండి వెళ్లిపోవడంతో చేసేదేమీ లేక గ్రామస్తులు వెనుదిరిగారు.

ఎన్నో ఏండ్ల కళ సఫలమౌతున్న వేళ గొడవలు చోటుచేసుకొని ఉద్రిక్త పరిస్థితులు నెలకొనడంతో బ్రిడ్జి ప్రారంభోత్సవానికి నోచుకోలేదని పలువురు ప్రజాప్రతినిధులు నిస్సహాయతను వ్యక్తం చేశారు.

అనుదినం జనపక్షం
నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
నిజామాబాద్-కామారెడ్డి

సోమవారం 30 జనవరి 2023

లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాలకు ఆహ్వానం



నవతెలంగాణ-జక్రాన్‌పల్లి

మండలంలోని కొలిప్యాక్, (మధ్వరాయలగుట్ట) గ్రామంలో శ్రీశ్రీశ్రీ ఆనందగిరి లక్ష్మీ నృసింహ స్వామి బ్రహ్మోత్సవాలకు రాష్ట్ర ఆర్టీసీ చైర్మన్ బాజిరెడ్డి గోవర్ధన్ వస్తున్నట్టు మండల రైతు సమన్వయ సమితి అధ్యక్షుడు దీకొండ శ్రీనివాస్ ఆదివారం తెలిపారు. ఫిబరి నుండి 7వరకు ఉత్సవాలు జరగనున్నాయని అన్నారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర ఆర్టీసీ కార్పొరేషన్ చైర్మన్‌తోపాటు జిల్లా యువ నాయకులు, జిల్లా పరిషత్ ఆర్థిక ప్రణాళిక సంఘ సభ్యులు, ధర్పల్లి జెడ్పిటిసి, ఒలంపిక్ సంఘం జిల్లా ఉపాధ్యక్షులు బాజిరెడ్డి జగన్మోహన్‌ను కొలిప్యాక్ గ్రామ కమిటీ, ఆలయ కమిటీ, రైతు సమన్వయ సమితి అధ్యక్షులు శ్రీనివాస్ ఆహ్వాన పత్రికను అందజేశారు.

జాతీయస్థాయి బ్యాడ్మింటన్ పోటీలకు జిలా క్రీడాకారుడు



నవతెలంగాణ-కంఠేశ్వర్

గుజరాత్ రాష్ట్రం గాంధీనగర్ లోని సచివాలయ జింఖానా సెక్టార్ -21లో ఈనెల 31నుంచి వచ్చేనెల 6 వరకు నిర్వహించే జాతీయ స్థాయి పోటీలలో పాల్గొనడానికి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల రాజారాంనగర్ డిచ్పల్లి మండలం నుండి టి.మహేష్ కుమార్ సీనియర్ అసిస్టెంట్(గణితం) బయలుదేరి వెళ్లారు. ఆదివారం ఆయన నిజామాబాద్ నుండి బయలుదేరారు. ఈ సందర్భంగా నిజామాబాద్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ సభ్యులు సీనియర్ క్రీడాకారులు ,పాఠశాల యాజమాన్య బృందం, 7వ బెటాలియన్ సిబ్బంది, మిత్రులు అభినందించి హర్షం వ్యక్తంచేశారు.

సమస్యలు పరిష్కంచడంలేదు

- కార్పొరేటర్ ఇంటి ఎదుట కాలనీవాసుల నిరసన



కార్పొరేటర్ ఇంటి ఎదుట నిరసన తెలుపుతున్న కాలనీవాసులు

నవతెలంగాణ-కంఠేశ్వర్

నిజామాబాద్ నగరంలో అధికార పార్టీ కార్పొరేటర్లకు కష్టాలు తప్పడం లేదు. సమస్యలు పరిష్కరించడం లేదని, కాలనీల అభివృద్ధికి నిధులు ఇప్పించడం లేదని, పనులు జరగడం లేదని నిరసనలు తప్పడం లేదు. ఆదివారం జిల్లా కేంద్రంలోని ముబారక్ నగర్‌లోగల 18వ డివిజన్ కార్పొరేటర్ యమునా అనిల్ ఇంటి ముందు గంగా స్థాన్ ఫేస్-1 గణేష్ నగర్ కాలనీవాసులు ధర్నా నిర్వహించారు. సమస్యలపై కార్పొరేటర్‌తోపాటు ప్రజా ప్రతినిధులకు, అధికారులకు విన్నవించిన పట్టించుకోవడం లేదని కాలనీవాసులు ఆరోపించారు. సమస్యలను పరిష్కరించకపోతే కార్పొరేషన్ కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతామని హెచ్చరించారు. కేవలం అధికార పార్టీకి సంబంధించిన కాలనీల్లో, ప్రజాప్రతినిధులు ఉన్నచోటే పనులను చేయిస్తున్నాడు తప్ప మిగతా పనులు చేయడంలో నిర్లక్ష్యం వహిస్తున్నాడని ఆరోపించారు. ఏదైనా సమస్య ఉంటే ఇంటికి వెళ్లి చెబితే చేస్తాను.. చూస్తాను.. అని సాకు చెబుతున్నాడన్నారు. ఇప్పటికైనా కార్పొరేటర్ కాలనీ అభివృద్ధికి కృషి చేయాలని కోరుతున్నారు.

పల్లెల్లో బెల్ట్ దందా

- ఉదయం 6 నుండి అర్ధరాత్రుల వరకు
- పట్టించుకోని ఎక్సైంజ్ అధికారులు



దోంచందలో బెల్టుషాపువద్ద ఖాళీ మద్యంసీసాలు

నవతెలంగాణ-ఏర్గట్ల

మండలంలోని పచ్చని పల్లెల్లో బెల్ట్ దందా అధికారికంగా కొనసాగుతోంది. సంవత్సర కాలంగా బెల్ట్ దందాను ఆపే వారే కరువయ్యారు. గ్రామానికి రెండు బెల్ట్ షాపుల చొప్పున నెలకొల్పి మద్యం ప్రియులకు అధిక ధరలకు అమ్మి ముక్కు పిండి వసూలు చేస్తున్నారు. ఇంత జరుగుతున్న ఎక్సైజ్ అధికారులు గ్రామాల్లోకి రావడం లేదు. పైగా ఓ విలేకరి ఎక్సైంజ్ సీఐ వివరణ కోరగా నా దృష్టికి ఆ విషయం రాలేదని, బెల్ట్ షాపులు గ్రామాల్లో ఉన్నవనే విషయం కూడా తెలియని బుకాయించారు. బెల్ట్ షాప్ నిర్వాహకులపై రాత పూర్వకంగా కంప్లైంట్ ఇస్తే చర్యలు తీసుకుంటానని అన్నారు. ఉదయం 6 నుండి మొదలైన బెల్ట్ దందా రాత్రి 10.30 అయినా ఆ ప్రాంతం అంతా జాతర వాతావరణం కొనసాగుతుంది. పైగా బెల్ట్ షాప్ నిర్వాహకులు వారికోసం మద్యం సిట్టింగ్ రూంలను సైతం ఏర్పాటు చేశారు. మద్యం సేవించిన అనంతరం మందుబాబులకు కిక్కు ఎక్కువై వాహనదారులకు, పాదాచారులకు ఇబ్బందులు కలిగించడమే గాక బెల్ట్ షాపుల యజమానులతో, తోటి మందుబాబులతో గొడవలకు దిగడంతో ఆ ప్రాంత ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. తొర్తి, బట్టాపూర్, తడపాకల్, దోంచంద, గుమ్మిర్యాల్ గ్రామాల్లో బెల్ట్ షాపులు దర్శనమిస్తాయి. బెల్ట్ షాపు నిర్వాహకులు లైట్ బీర్ పై, స్ట్రాంగ్ బీర్ పై 10 రూపాయలు, క్వాటర్‌పై 10 రూపాయలు, ఫుల్ బాటిల్ పై 40 రూపాయలను ఎమ్మార్పీ రేటు కంటే అదనంగా వసూలు చేస్తున్నారు. ఇంత జరుగుతున్నా ఎక్సైజ్ అధికారులు స్పందించక పోవడంతో ప్రజలు వారిపై పలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. దీనిపై వెంటనే స్పందించి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

నిధుల మంజూరుపై హర్షం



ఎమ్మెల్యేకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న గ్రామస్తులు

నవతెలంగాణ-సిరికొండ

మండలంలోని కుర్దుల్ పేట్ గ్రామానికి పలు అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేసిన రురల్ ఎమ్మెల్యే, టీఎస్ ఆర్టీసీ చెర్మెన్ బాజిరెడ్డి గోవర్ధన్‌కి ఆదివారం రోజు కుర్దుల్ పేట్ గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు. 10 లక్షలు సీసీ రోడ్డు, గ్రామపంచాయతీ సొంత భవనం నిర్మాణం కోసం నిధులు మంజూరు చేయడం హర్షణీయమని అన్నారు. అనంతరం ఒలంపిక్ సంఘం జిల్లా ఉపాధ్యక్షులు బాజిరెడ్డి జగన్‌ను కలిసి కృతజ్ఞతలు తెలిపారు. కుర్దుల్‌పేట్ గ్రామ సమస్యలను ఎమ్మెల్యేకు వివరించారు. కార్యక్రమంలో సర్పంచ్ ద్యాగ గంగాధర్, ఎంపీటీసీ గాండ్ల సతీష్ పటేల్, చిన్నోళ్ల గంగాధర్, ద్యాగ చిన్న గంగాధర్, పెద్దోళ్ల ఆదిత్య తదితరులు పాల్గొన్నారు.

విశ్వ బ్రాహ్మణ యువజన నూతన కమిటీ ప్రమాణస్వీకారం



ప్రమాణస్వీకారం చేసిన కార్యవర్గం

నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ

అఖిల భారత విశ్వబ్రాహ్మణ యువజన సంఘం నూతన కమిటీ ప్రమాణస్వీకారం ఆదివారం నాగారంలోని పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సంఘం రాష్ట్ర అధ్యక్షులు కొండోజు లక్ష్మణాచారి నూతన జిల్లా, డివిజన్, నగర కమిటీలతో ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. యువజన సంఘం కులంలోని అసమానతలను తొలగించటం కోసం కృషిచేయాలన్నారు. సంఘంలోని వ్యక్తులకు అపదలో ఆర్థికంగా చేయూతను ఇచ్చిందని ఎన్నో సేవా కార్యక్రమాలు చేసిందని, సంఘాన్ని పటిష్టం చెయ్యాలని పిలుపిచ్చారు. కార్యక్రమంలో సజ్జనం భానుచందర్‌ను రాష్ట్ర సంయుక్త కార్యదర్శిగా నియమించారు, జిల్లా అధ్యక్ష కార్యదర్శులుగా భిక్షిని ప్రదీప్ ఆచార్య, పోల లోహిత్ ఆచార్య, నగర అధ్యక్ష, కార్యదర్శిగా వడ్ల వెంకటేష్ ఆచార్య, నాగేష్ ఆచార్య, నిజామాబాద్ రూరల్ అధ్యక్ష, కార్యదర్శిగా కోటగిరి సంతోషాచార్య, రాజు ఆచార్య ధనుంజయ ఆచార్య మెట్టెల నరేంద్ర ఆచార్య ప్రమాణ స్వీకారం చేశారు.

జగిత్యాల మున్సిపల్ చైర్పర్సన్ రాజీనామా వెనక్కి తీసుకోవాలి

- పద్మశాలీ సంఘం ఎప్పుడు మద్దతుగా ఉంటుంది
- సంఘం జిల్లా అధ్యక్షులు భోగ అశోక్



మాట్లాడుతున్న పద్మశాలీ సంఘం నాయకులు

నవతెలంగాణ-జక్రాన్‌పల్లి

జగిత్యాల మున్సిపల్ చైర్పర్సన్ భోగ శ్రావణి తన రాజీనామాను వెనక్కి తీసుకోవాలని, యావత్ పద్మశాలి సంఘం ఎప్పుడూ మద్దతుగా ఉంటుందనిపద్మశాలి సంఘం నిజామాబాద్ జిల్లా అధ్యక్షుడు భోగ అశోక్ అన్నారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ..

ఎలాంటి రాజకీయ ఇబ్బందులు జరిగిన యావత్ పద్మశాలి సమాజం ఎల్లప్పుడూ అండగా ఉంటుందని భోగ అశోక్‌తోపాటు, అఖిలభారత పద్మశాలీ సంఘం డెలిగేట్ సభ్యులు దాసరి నర్సింలు అలాగే ప్రధాన కార్యదర్శి మైసల నారాయణ తెలిపారు. కులస్తుల అభ్యున్నతి, రాజకీయంగా ఆర్థికంగా ఎదిగేందుకు కావలసిన పలు అంశాలపై చర్చించారు. పద్మశాలీ కులస్తులు అన్ని రంగాల్లో రాణించాలని పిలుపునిచ్చారు. సమావేశంలో ఉపాధ్యక్షులు చిలుక నరసయ్య గంగుల దత్తాద్రి సెక్రటరీ ఇరవత్రి గంగా చరన్ మరియు జిల్లా లోని ఆయా మండల గ్రామాల పద్మశాలి కుల సంఘ సభ్యులు పాల్గొన్నారు.

డయాగ్నస్టిక్ సెంటర్ ఏర్పాటుచేయడం అభినందనీయం

- విశ్వం డయాగ్నస్టిక్స్‌ను ప్రారంభించిన సందర్భంగా మంత్రి కేటీఆర్



విశ్వం డయాగోస్టిక్స్‌ను ప్రారంభిస్తున్న మంత్రి కేటీఆర్

నవతెలంగాణ-కంఠేశ్వర్

నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని జిల్లా కోర్టు ఎదుట గల సరస్వతి నగర్ కాలనీలో ఏర్పాటుచేసిన విశ్వం డయాగ్నస్టిక్స్ సెంటర్‌ను తెలంగాణ రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి కేటీఆర్ ముఖ్యఅతిథిగా శనివారం నిజామాబాద్ జిల్లా కేంద్రానికి వచ్చిన సందర్భంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి కేటీఆర్ మాట్లాడుతూ.. నిజామాబాద్ జిల్లా ప్రజలే కాకుండా చుట్టుపక్కల ఉన్న జిల్లాల ప్రజలకు కూడా హైదరాబాద్ వెళ్లకుండా నిజామాబాద్‌లోనే డయాగ్నస్టిక్ సెంటర్ ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. నూతన హంగులతో అత్యుత్తమ పరికరాలతో స్కానింగ్ సెంటర్లను సిటీ స్కాన్ డయాగ్నస్టిక్ సెంటర్‌లో ఏర్పాటు చేశారన్నారు. ఈ సందర్భంగా ఆసుపత్రి యాజమాన్యం డాక్టర్ వివేకానంద ఎంబీబీఎస్ మాట్లాడుతూ.. నిజామాబాద్ జిల్లా ప్రజల కోసం నూతన హంగులతో డయాగ్నస్టిక్స్ ఏర్పాటు చేశామని, సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అతి తక్కువ ధరలలో సామాన్య ప్రజలు కూడా డయాగ్నస్టిక్ సెంటర్లో స్కానింగ్ చేయించుకోవచ్చని తెలిపారు. కార్యక్రమంలో మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి, నిజామాబాద్ అర్బన్ రూరల్ ఎమ్మెల్యేలు బిగాల గణేష్ గుప్తా, బాజిరెడ్డి గోవర్ధన్, ఆర్మూర్ ఎమ్మెల్యే ఆశన్న గారి జీవన్ రెడ్డి, బోధన్ ఎమ్మెల్యే షకీల్, నగర మేయర్ దండు నీతూ కిరణ్, మాజీ స్పీకర్ సురేష్ రెడ్డి, టీఎస్ డబ్ల్యు డి సి చైర్పర్సన్ ఆకుల లలిత, కార్పొరేటర్ బైకాన్ సుధా మధు, నుడా చైర్మన్ ప్రభాకర్ రెడ్డి, ఇండియన్ మెడికల్ అసోసియేషన్ అధ్యక్షులు రామచందర్ ప్రధాన కార్యదర్శి జలగం తిరుపతి లతోపాటు కోదాడ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్, ఆస్పత్రి యాజమాన్యం డాక్టర్ విజయ్ ఎం డి ఎస్, డాక్టర్ ఎండి విషుత్ రేడియాలజిస్ట్, వసంత, నవ్య శ్రీ, కావ్య, విజయ స్కూల్ కార్యదర్శి అమృతలత, విజయ్ హై స్కూల్ అడ్మినిస్ట్రేటివ్ డైరెక్టర్ సుజాత పాల్గొన్నారు.

సిద్దాపూర్ క్లస్టర్ పరిధిలో ప్రత్యేక సొసైటీని ఏర్పాటు చేయాలి

- కాంగ్రెస్ పార్టీ మండల నాయకుల డిమాండ్



మాట్లాడుతున్న సయ్యద్ ఖలీల్

నవతెలంగాణ-బోధన్

బోధన్ మండలంలోని సిద్దాపూర్ క్లస్టర్ గ్రామాలైన సిద్దాపూర్, ఖండ్ గాం, బిక్నెల్లి, హంగర్గా, కొప్పర్గ గ్రామాలను కలిపి రైతుల సౌకర్యార్థం ప్రత్యేక ప్రాథమిక వ్యవసాయ సహకార కేంద్రం (సొసైటీ)ని ఏర్పాటు చేయాలని కాంగ్రెస్ పార్టీ మండల సీనియర్ నాయకులు కొప్పర్గ ఉప సర్పంచ్ సయ్యద్ ఖలీల్ డిమాండ్ చేశారు. ఆదివారం ఆయన గ్రామంలో విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. హంగర్గా, ఖండ్ గాం, బిక్నెల్లి గ్రామాల రైతులు సొసైటీ పనులపై కల్దుర్కి పోవడానికి ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. కావున ఈ ఐదు గ్రామాల రైతుల సౌకర్యార్థం కొప్పర్గలో ప్రత్యేక సొసైటీని ఏర్పాటు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. సమావేశంలో గ్రామ రైతులు పాల్గొన్నారు.

లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ప్రారంభమైన బ్రహ్మోత్సవాలు

నవతెలంగాణ ఎడపల్లి

మండలంలోని జానకంపేట శివారులోగలశ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయ బ్రహ్మోత్సవాలు ఆదివారం ప్రారంభమయ్యాయి. వచ్చేనెల 6 వరకు బ్రహ్మోత్సవాల నిర్వహించనున్నట్టు ఆలయ కమిటీ చైర్మన్ పురం సాయిలు తెలిపారు. ఆదివారం ఓం నమో నారాయణ అధ్యయనోత్సవం సముద్రాల శ్రీధరచార్యులుతో చేయించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ పురం సాయిలు, దేవాదాయ ధర్మాదాయ శాఖ ఈవో వేణు, ఆలయ కమిటీ ధర్మకర్త చిలుక నర్సయ్య, దేవాదాయ ధర్మాదాయ శాఖ జూనియర్ అసిస్టెంట్ రఘు, శ్రీరంగం కొండమాచార్యులు, గ్రామ పెద్దలు, భక్తులు పాల్గొన్నారు.

ఆరోగ్యంగా ఉన్నవారే నిజమైన ధనవంతులు

- నిజామాబాద్ సీపీ నాగరాజు
- ఉత్సాహంగా 21కిలోమీటర్ల రన్



మారథాన్ రన్‌ను ప్రారంభిస్తున్న సీపీ నాగరాజు

నవతెలంగాణ-కంఠేశ్వర్

ఎవరైతే ఆరోగ్యంగా ఉంటారో వారే నిజమైన ధనవంతులని నిజామాబాద్ పోలీస్ కమిషనర్ నాగరాజు అన్నారు. ఇండియన్ మెడికల్ అసోసియేషన్, అంకం హాస్పిటల్ నిజామాబాద్ వారి సంయుక్త ఆధ్వర్యంలో జిల్లా ప్రజలకు నడక, పరుగు ఆరోగ్యం పట్ల అవగాహన కల్పించడానికి ప్రభుత్వ పాలిటెక్నిక్ మైదానం నుండి మామిడి పల్లి రైల్వే గేట్ (ఆర్మూర్ రోడ్) వరకు వెళ్లి 21కిలోమీటర్ల పరుగు పందెం(అంకం హెల్త్ మారథాన్ ఓపెన్ కాంపిటీషన్) ఆదివారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పోలీస్ కమిషనర్ కె ఆర్ నాగరాజు పాల్గొని జెండా ఊపి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ.. ప్రపంచం లో ధనవంతులు అంటే డబ్బు ఉండడం కాదు ఎవరైతే ఆరోగ్యంగా ఉంటారో వారే నిజమైన ధనవంతులని అన్నారు. ప్రతిరోజు నడక, పరుగు అలవరుచుకుని మితంగా ఆహారం తీసుకుంటూ, ధూమ, మద్య పానాలకు దూరంగా ఉంటూ ఆరోగ్యాన్ని కాపాడు కోవాలని తెలిపారు. ఈ రన్ కు 150 మందితో భారీ సంఖ్యలో పాల్గొనడం ఎంతో ఉత్సాహంగా ఉందన్నారు. ఇండియన్ మెడికల్ అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు డా. నీలి రాం చందర్, డాక్టర్ జలగం తిరుపతి రావ్ మాట్లా డుతూ.. పరుగుకు సహకరించిన వారికి పాల్గొన్న వారికి కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం పరుగు పందెం లో గెలుపొందిన వారికి అంకం హాస్పిటల్ సహకారం తో మొదటి ప్రైజ్ 10వేలు మహేష్‌కు, రెండవ ప్రైజ్ 7000 వేలు భారత్ రాజ్‌కు, మూడో ప్రైజ్ 5వేల రూపాయలు ఓంకార్‌కు, నాలుగో ప్రైజ్ 3000 వేల నరసయ్యకు, ఐదోప్రైజ్ 1500 వందల రూపాయలు రాంబాబుకు అందజేశారు. ప్రైజ్‌మనీతోపాటు గోల్డ్ మెడల్స్ ను కూడ అందజేశారు. ఈ రన్ పూర్తి చేసిన 80శాతం వారికి కూడా మెడల్స్‌ను అందజేశారు. కార్యక్రమంలో ఇండియన్ మెడికల్ అసోసియేషన్ వైద్యులు డాక్టర్లు చంద్ర శేఖర్ రెడ్డి, అరవింద్ రెడ్డి, గోపాల్ సింగ్, నాగ మోహన్ రావు, రాఘవేంద్రరావు, ఆనంద్, అనిల్, కిరణ్, శేషగిరిరావు, స్పాన్సర్లు డాక్టర్లు అంకం గణేష్, భాను ప్రియా, గోవింద్ రావు, పోలీస్ సిబ్బంది, రజినీశ్, మహేశ్, అభిషేక్, సత్య నారాయణ తదితరులు పాల్గొన్నారు.

మల్యాద్రి రెడ్డి దిష్టిబొమ్మ దహనం



దిష్టిబొమ్మను దహనం చేస్తున్న దళిత నాయకులు

నవతెలంగాణ-కోటగిరి

బాన్సువాడ ఆస్పత్రి సూపరింటెండెంట్, దళిత బిడ్డ అయిన శ్రీనివాస్ ప్రసాద్‌పై బీజేపీ నియోజకవర్గ నాయకులు చేసిన ఆరోపణలపై నిరసన తెలిపారు. ఆదివారం మండలకేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద బీజేపీ నియోజకవర్గ నాయకులు మల్యాద్రిరెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈసందర్భంగా దళిత నాయకులు మాట్లాడుతూ... దళిత సమాజానికి చెందిన డాక్టర్ శ్రీనివాస్ ప్రసాద్ బాన్సువాడ ఏరియా హాస్పిటల్ సూపరింటెండ్‌పై బీజేపీ నాయకులు అనుచిత వ్యాఖ్యలు చేయడం సరికాదన్నారు. మొన్న దళిత బిడ్డ మల్లికార్జున్‌ను, నేడు శ్రీనివాస్ ప్రసాద్‌ను అవమానించారని మండిపడ్డారు. కులం, జాతి పేరుతో తెలంగాణాలో చిచ్చుపెట్టే పని మానుకోవాలన్నారు. లేకుంటే తగిన మూల్యం చెల్లించాల్సి వస్తుందని అన్నారు. కార్యక్రమంలో మాల మహానాడు అధ్యక్షుడు మిర్జాపూర్ సాయన్న, రాములు, సాయిలు, తదితరులు పాల్గొన్నారు

గ్రామాల అభివృద్ధికి ఒక్క పైసా అయినా తెచ్చారా

- పసుపు బోర్డు తెచ్చే దమ్ము లేదు
- రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేయడం సిగ్గుచేటు
- ఆర్టీసీ చైర్మన్ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్



ప్రారంభోత్సవం చేసిన బాజిరెడ్డి గోవర్ధన్

నవతెలంగాణ-డిచ్‌పల్లి

బీజేపీ కేంద్రంలో అధికారంలో ఉన్నా.. జిల్లా ఎంపిగా గ్రామాల అభివృద్ధికి ఒక్క పైసా తెచ్చావా.. అని రాష్ట్ర ప్రభుత్వం గ్రామాల అభివృద్ధికి కోట్లాది రూపాయలు నిధులు మంజూరు చేస్తూ అభివృద్ధి చేస్తుందని, ఇది కనబడటం లేదా.. అని నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే, ఆర్టీసీ చైర్మన్ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ అన్నారు. ఎన్నికల సమయంలో జిల్లాకు పసుపు బోర్డు తెస్తావని హామీనిచ్చి బాండ్ పేపర్ రాసి ఇచ్చి ఊసెత్తకుండా రాష్ట్ర ప్రభుత్వానికి డిమాండ్ చేయడం సిగ్గుచేటుని అన్నారు. ఆదివారం ఇందల్వాయి మండలంలోని మల్లాపూర్ గ్రామంలో వైకుంఠధామం, క్రీడా ప్రాంగణం, ఆలయాల నిర్మాణాలు, రహదారులు, మహిళా భవనంకు ఎమ్మెల్సీ వి గంగాధర్ గౌడ్, ఒలంపిక్ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు, ధర్పల్లి జడ్పిటిసి జగన్మోహన్, ఐడిసిఎంఎస్ చైర్మన్ సాంబార్ మోహన్, ఎంపీపీ భగవత్ రమేష్ నాయక్, జడ్పిటిసి సుమన రవి రెడ్డితో కలిసి ప్రారంభోత్సవాలు చేశారు. గ్రామంలో ఏర్పాటు చేసిన సభలో బాజిరెడ్డి గోవర్ధన్ మాట్లాడుతూ.. 66 ఏళ్లలో చేయని అప్పు బీజేపీ ప్రభుత్వంలోని నరేంద్ర మోడీ 100 లక్షల కోట్లు అప్పుచేసి పెద్దలకు పెట్టారన్నారు. కేసీఆర్ ప్రభుత్వం అప్పు చేసిన గ్రామాల అభివృద్ధికి కేటాయించింద న్నారు. జిల్లాకు చెందిన రాజ్యసభ సభ్యుడు సురేష్ రెడ్డి తనకు వచ్చే ఐదు కోట్ల నిధుల్లో నిజామాబాద్ రూరల్‌లోని గ్రామాల అభివృద్ధికి 50 లక్షల అందజేశారని ఎంపీ ఇప్పటికీ రూపాయి ఇచ్చిన దాఖలు లేవన్నారు. మల్లాపూర్ బ్రిడ్జి వాగు నిర్మాణానికి నాలుగున్నర కోట్లు, మల్లాపూర్ స్వాగత నుండి లోలం వరకు సిసి రహదారికి 55 లక్షలు కేటాయించడం జరిగిందన్నారు. గ్రామం లో కమ్యూనిటీ హాల్ లో నిర్మాణానికి నిధులను మంజూరు చేస్తారని హామీలు ఇచ్చారు అంతకు ముందు సర్పంచ్ లోలం సత్య నారాయణ, ఉపసర్పంచ్ రఘునాథ రాముల ఆధ్వర్యంలో గ్రామ స్వాగత తోరణం నుండి డప్పు వాయిద్యాలు, బోనాలతో ఎమ్మెల్యే, ఎమ్మెల్సీకి స్వాగతం పలికి అనంతరం సన్మానించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ భూషణ్ అంజయ్య, ఎంపీటీసీ డీకొండ సరిత, సుధీర్, బీఆర్ ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు చిలివేరి దాస్, సర్పంచ్లు నరేష్,తేలు గణేష్, తేలు విజయ్ కుమార్, ఎంపిటిసి బాబురావు, ఎంపీడీవో రాములు నాయక్, ఎస్సై నరేష్ కుమార్, గ్రామ అభివృద్ధి కమిటీ సభ్యులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.